RNI
TEL TEL / 2023/ 84132

# అక్షర సవాల్

సామాన్యుడు ప్రశ్నించే గొంతుక

ప్రచురణ-హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ ఎడిటర్: బాదావత్ బాలాజి సంపుటి :04 సంచిక :36 ఆదివారం 03 మే 2026 పేజీలు -8 వెల రూ 5-00

## కవిత పార్టీలోకి వలసలు

**హైదరాబాద్, మే 2:**కొత్తగా కల్వకుంట్ల కవిత ప్రారంభించిన పార్టీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో పార్టీ ప్రారంభించిన కవితకు.. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీగా కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పార్టీ ప్రారంభించడానికి ముందే బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు.. కవితకు మద్దతు తెలిపారు. ఈ క్రమంలోనే తాజాగా మరో మాజీ మంత్రి బోడ జనార్దన్.. కల్వకుంట్ల కవితతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలోనే తన అనుచరులతో కలిసి అతి త్వరలోనే టీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు బోడ జనార్ధన్ స్పష్టం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసిన సీనియర్ నేత బోడ జనార్ధన్ కీలక చర్చలు జరిపారు. త్వరలోనే తన ఫ్యాన్స్, మద్దతుదారులతో కలిసి టీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో టీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని బోడ జనార్ధన్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు శాసనసభ నియోజకవర్గం నుంచి బోడ జనార్ధన్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రిగా బోడ జనార్ధన్ పని చేశారు. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపేతం చేయడానికి..

రిపోర్టర్లు కావలెను

ఈ క్రింది పోస్టులకు అనుభవజ్ఞులు కావలెను

సబ్ ఎడిటర్లు - 02
బ్యూరో చీఫ్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) - 01
స్టాఫ్ రిపోర్టర్లు - 06 (జనగాం, మానుకోట, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ)
అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ - 01
యాడ్ ఆఫీసర్స్ - 02
సర్క్యులేషన్ ఆఫీసర్ - 01
అనుభవాన్ని బట్టి వేతనం ఇవ్వబడును.

ఇంకెందుకు ఆలస్యం...
9347332442, 8096677136 నంబర్‌కు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

# విద్యుత్ సబ్‌స్టేషన్ల పక్కనే సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు

**సోలార్ పవర్ పైన స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన**

**విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ ఉన్నత స్థాయి సమీక్ష**



**హైదరాబాద్:**రాష్ట్రంలో నూతన పారిశ్రామిక వాడలు, హైస్పీడ్ రైల్ కారిడార్లు, ట్రిపుల్ ఆర్ వంటి అభివృద్ధి ప్రాజెక్టులు రానున్న నేపథ్యంలో డిమాండ్కు తగిన విద్యుత్ సరఫరాకు అవసరమైన సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి, ప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తో కలిసి ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి తో పాటు ఇంధన శాఖకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు. గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా ప్రాధాన్యక్రమంలో దరఖాస్తులు పెట్టుకున్న వారికి అనుమతులు ఇవ్వాలని అధికారులకు చెప్పారు. భారీ డేటా సెంటర్లకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సోలార్ పవర్ పైన స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సోలార్ స్టౌల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల పక్కనే సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద భూమి అందుబాటులో ఉన్న చోట ఉమ్మడి జిల్లాలో రెండు సబ్ స్టేషన్ల పక్కన ప్రయోగాత్మకంగా సోలార్ పవర్ ప్లాంట్లు నెలకొల్పాలని సూచించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టే 18 సోలార్ పవర్ ప్లాంట్లు (హైదరాబాద్ మినహా ఉమ్మడి తొమ్మిది జిల్లాల్లో జిల్లాకు రెండు చొప్పున) నిర్మాణానికి నోడల్ అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యుత్ శాఖలో సరఫరా లోపాలు, మెరుగైన విద్యుత్ సరఫరాకు ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని చెప్పారు. తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (Rythu Discom) లో చేరికపై ఉద్యోగులు, సిబ్బందికి ఉన్న అపోహలు తొలగించాలని అధికారులను ఆదేశించారు.



# కేసీఆర్ సర్జికల్ స్ట్రైక్....

**హైదరాబాద్, మే 2:**కొత్తగా చెప్పాల్సిన పనిలేదు.. కెసిఆర్ ఫామ్ హౌస్ లో ఉన్నా.. ప్రగతిభవన్ లో ఉన్నా.. ఆయన దృష్టి మొత్తం రాజకీయాలు చుట్టూ తిరుగుతుంది. ఆయన ఆలోచన మొత్తం అధికారాన్ని సాధించడం లేదా సుస్థిరం చేసుకోవడం అయిపోగానే సాగుతుంది. కెసిఆర్ గురించి తెలిసినవారు.. కెసిఆర్ గురించి ఎరుకైన వారు నిత్యం చెప్పే మాటలు ఇవే. కెసిఆర్ రాజకీయ దురంధరుడు. తెలంగాణ రాజకీయాలలో తలపండినవాడు. అనేక ఆటుపోట్లు ఎదుర్కొని నిలబడినవాడు.. అన్నిటికంటే ముఖ్యంగా హేళన చేసిన వారి ముందు తల ఎగరేసి సవాల్ చేసినవాడు.. - మిగతా5లో

**జూన్2 నాటికి జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల**

# సమస్యకు పరిష్కారం

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**




**హైదరాబాద్:** అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు సందర్భాలలో ఇచ్చిన హామీల మేరకు అందరి అభిప్రాయాలను సేకరించి వచ్చేనెల 2వ నాటికి నాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని వెల్లడించారు. సచివాలయంలోని తన మంత్రి కార్యాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్, తెలంగాణ హౌసింగ్ సొసైటీలతో మంత్రిసమావేశం నిర్వహించారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి, అందులో సభ్యుల సంఖ్య, సభ్యత్వానికి అర్హతలు, ఇతర అన్ని అంశాలపై -- మిగతా5లో

**మే నెలలో ఎండలు,**

# వడగాల్పుల తీవ్రత

**భారత వాతావరణ శాఖ వెల్లడి**



**న్యూ డిల్లి మే 2:**మే నెలలో నమోదయ్యే ఉష్ణగ్రతలపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కీలక విషయాలను వెల్లడించింది. ఈ నెలలో ఎండలు, వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర హెచ్చరించారు. సాధారణంగానే మే నెలలో దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. అయితే, ఈ ఏడాది కొన్ని నిర్దిష్ట ప్రాంతాల్లో వడగాల్పుల - మిగతా5లో

**రికార్డు స్థాయికి**

# తెలంగాణ ఆదాయం

**ఏప్రిల్‌లో 35% వృద్ధి**

**దూసుకుపోయిన జీఎస్టీ వసూళ్లు!**

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. 2026 ఏప్రిల్ నెలలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అత్యధిక వసూళ్లను నమోదు చేస్తూ చరిత్ర సృష్టించింది. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్టీ (+రూ) వసూళ్లలో 35 శాతం భారీ వృద్ధి నమోదైనట్లు వాణిజ్య పన్నుల కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

**జీఎస్టీ చరిత్రలోనే అత్యధికం**

రాష్ట్రానికి ఏప్రిల్ 2026లో ఏకంగా రూ. 4,621 కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చింది. గత ఏడాది ఇదే నెలలో ఈ మొత్తం రూ. 3,433 కోట్లుగా ఉండగా, ఇప్పుడు అదనంగా రూ. 1,188 కోట్లు వసూలైంది. జీఎస్టీ వ్యవస్థ అమలులోకి వచ్చినప్పటి నుండి ఒక నెలలో ఈ స్థాయిలో ఆదాయం రావడం ఇదే మొదటిసారి.

**వరుస విజయాలు:**

గత నాలుగు నెలలుగా తెలంగాణ జీఎస్టీ ఆదాయం స్థిరంగా రూ. 4,000 కోట్లకు పైగానే నమోదవుతోంది.

**మొత్తం ఆదాయం:**

జీఎస్టీతో పాటు పెట్రోల్, మద్యంపై వ్యాట్ (VAT), వృత్తి పన్నులను కలుపుకుని మొత్తం రూ. 7,570 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి చేరింది.



**దేశంలోనే రెండో స్థానం:**

పన్ను వసూళ్ల వృద్ధి రేటులో కర్ణాటక తర్వాత తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచి తన ఆర్థిక సత్తాను చాటింది.

**ఈ నెల 10 న ప్రధాని**

# తెలంగాణ పర్యటన



**బీజేపీ రామచంద్రరావు**

**మెదక్:**మే 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు విచ్చేస్తున్నారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన రాష్ట్రానికి రావడం ఇదే తొలిసారి. ఈ పర్యటన సందర్భంగా సుమారు రూ. 7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు వెల్లడించారు. మెదక్ జిల్లా రామాయంపేట్ లో నిర్వహించిన మీడియా సమావేశంలోఅయన మాట్లాడారు. రామచంద్రరావు మాట్లాడుతూ జహీరాబాద్లో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ సిటీ, వరంగల్లో టెక్స్టైల్ పార్క్, పీఎం మిత్ర హ్యాండ్లూమ్ పార్క్ వంటి కీలక ప్రాజెక్టులను - మిగతా5లో

# ఇందిరమ్మ ఇండ్లకు కాంగ్రెస్ మూడు రంగులు వేయకపోతే బిల్లులు ఇవ్వట్లే

**కేంద్ర నిధులతో కట్టిన ఇండ్లను పార్టీ రంగులతో ముడిపెట్టడం ప్రజాస్వామ్య విరుద్ధం..**

**బీజేపీ మండల అధ్యక్షుడు కొంగర రవి**



**గీసుకొండ, మే 2 (అక్షర సవాల్):** ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులను కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా వేధిస్తోందని బీజేపీ గీసుకొండ మండల అధ్యక్షుడు కొంగర రవి తీవ్ర ఆరోపణలు చేశారు. "ఇండ్లకు కాంగ్రెస్ పార్టీకి చెందిన మూడు రంగులు, పార్టీ జెండా ఎంబ్లెమ్ వేయకపోతే పూర్తిస్థాయిలో బిల్లులు విడుదల చేయబోమని అధికారులు, స్థానిక కాంగ్రెస్ నేతలు పేద లబ్ధిదారులను బెదిరిస్తున్నారుని ఆయన మండిపడ్డారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని, అయితే ఆ ఇండ్లను ఒక పార్టీ రంగులతో, జెండాతో ముడిపెట్టి ప్రచారం చేసుకోవడం ప్రజాస్వామ్యానికి పూర్తి విరుద్ధమని కొంగర రవి



విమర్శించారు. ప్రజల పన్నుల సొమ్ముతో అమలవుతున్న పథకాలను కాంగ్రెస్ పార్టీ సొత్తుగా చిత్రీకరించడం దారుణం. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి రాజకీయాలకు అతీతంగా ప్రయోజనం అందాలి అని ఆయన స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు వేధింపులకు పాల్పడుతున్నా అధికారులు మౌనంగా ఉండడం బాధాకరమని పేర్కొంటూ,- మిగతా2లో

**మహిళా సాధికారతే**

# కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం...





**మంత్రి సురేఖ..**

**వరంగల్ ప్రతినిధి, అక్షర సవాల్:** మహిళా సాధికారపై కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అ న్నారు. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని శివనగర్ సాయి ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనారిటీ వర్గానికి చెందిన 248 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఇందిరమ్మ చీరలను మంత్రి గారి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అధికార యంత్రాంగం దృశ్య మాధ్యమం ద్వారా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 99 రోజుల్లో సాధించిన ప్రగతిని వివరించారు. శానిటేషన్, ప్రజారోగ్యం, 'అరైవ్ అలైవ్'లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై నివేదికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, - మిగతా5లో

# సంపాదకీయం

## బ్యాలెట్ బాక్సుల్లో భవితవ్యం

ప్రజాస్వామ్య భారత్‌లో ఎన్నికలు అంటే కేవలం ఓట్లు వేయడం మాత్రమే కాదు. ఆ ఓటు ఫలితం ఏంటో తెలుసుకోవాలని ఉత్సుకత ప్రతి ఒక్కరిలో ఉంటుంది. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ముందే ప్రజల నాడిని పట్టుకోవాలని ప్రయత్నించే చర్య సర్వేలు. ప్రస్తుతం 2026లో ఐదు రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ కూడా వచ్చాయి. అయితే ఈ సర్వేలు ఎలా చేస్తారు. వీటికి ఉండే చట్టబద్ధత ఏంటీ అనే విషయాలను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒపీనియర్ పోల్ లేదా అభిప్రాయ సేకరణ అనేది ఎన్నికలు ప్రారంభంకావడానికి ముందే నిర్వహించే సర్వే. నామినేషన్ల ప్రక్రియకు ముందు లేదా ప్రచారం జరుగుతున్న సమయంలో వీటిని చేపడతారు. ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు, వారి ప్రధాన సమస్యలు ఏంటీ, ప్రచార పద్ధతులు ఓటర్లను ఎంత వరకు ప్రభావితం చేస్తున్నాయి అనేది తెలుసుకోవడానికి సర్వేలు చేస్తారు. శాంపిల్ సైజ్ నుంచి సమాచారాన్ని సేకరిస్తారు. ఎన్నికల ప్రచారం సాగుతున్న కొద్దీ ప్రజల అభిప్రాయాలు మారే ఛాన్స్ ఉంది. అందుకే ఒపీనియన్ పోల్ ఫలితాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఎగ్జిట్ పోల్ అనేది ఓటు వేసిన తర్వాత బయటకు వచ్చిన ఓటరు అభిప్రాయాన్ని నేరుగా సేకరించే ప్రక్రియ. ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే పోలింగ్ కేంద్రం వెలుపల ఈ సర్వే చేస్తారు. సర్వే చేసే వ్యక్తులు పోలింగ్ బూత్ బయట వేచి ఉండి, ఓటు వేసి వస్తున్న వారిని మీరు ఎవరికి ఓటు వేశారు అని అడిగి తెలుసుకుంటారు. ఓటరు తన నిర్ణయాన్ని అమలు చేసిన తర్వాత చెప్పే మాటలు కాబట్టి ఇవి ఒపీనియన్ పోల్స్ కంటే కాస్త కచ్చితత్వానికి దగ్గరగా ఉంటాయని భావిస్తున్నారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక అంచనాలు మాత్రమే. అధికారిక ఫలితాలు కావు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగడానికి కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని రూల్స్ ఫ్రేమ్ చేసింది. ముఖ్యంగా ఎగ్జిట్ పోల్స్ ప్రసారంపై ఆంక్షలు విధించింది. ఎన్నికలు ఒకటి కంటే ఎక్కువ దశల్లో జరుగుతున్నప్పుడు అన్ని దశల పోలింగ్ పూర్తి అయ్యే వరకు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడించకూడదు. ఇవాళ కూడా దీన్ని అమలు చేసింది. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై ఆరు గంటలకు ముగిసింది. ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఆరున్న తర్వాత వెల్లడించారు. ఈ రూల్స్ అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ ఉంటాయి. మీడియా సంస్థలు, పరిశోధన ఏజెన్సీలు, పోలింగ్ సంస్థలు వివిధ పద్ధతుల ద్వారా డేటాను సేకరిస్తాయి. క్షేత్రస్థాయిలో ఓటర్లతో మాట్లాడటం ద్వారా, టెలీఫోన్ ద్వారా ఓటర్ల అభిప్రాయం తెలుసుకుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో టీంలను పంపించి సమాచారాన్ని సేకరిస్తారు. మరో వైపు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు అన్ని సర్వేలు డీఎంకే కూటమిదే మళ్లీ అధికారమని అంచనా వేశాయి. కానీ, ఒక్క సంస్థ మాత్రం దళపతి విజయ్ పార్టీ టీవీకే మెజార్టీ స్థానాల్లో గెలిచి, అధికారం చేపడుతుందని తెలిపింది. యాక్సిస్ మై ఇండియా సర్వే విజయ్ పార్టీ సునామీ తథ్యమని జోస్యం చెప్పింది. ఆ సంస్థ అంచనా ప్రకారం టీవీకే 98 నుంచి 120 స్థానాలు, డీఎంకే కూటమి 92 నుంచి 110, అన్నాడీఎంకే కూటమి 22 నుంచి 30 సీట్లలో గెలుస్తుందని పేర్కొంది. మొత్తం 234 స్థానాలున్న తమిళనాడులో అధికారం చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 118 స్థానాలు. ఆ సర్వే అంచనా నిజమైతే విజయ్ ముఖ్యమంత్రి అవుతారు. అయితే, తుది ఫలితాలు అంచనాలకు దగ్గరగా ఉంటాయా? లేదా? అనేది మే 4న తేలిపోనుంది. అంతేకాదు, అంచనాలు తారుమారై డీఎంకే కూటమి మెజార్టీ మార్క్‌కు దగ్గరగా ఆగిపోతే విజయ్ మద్దతు కీలకమవుతుంది. రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.అయితే, గతంలో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో యాక్సిస్ మై ఇండియా సర్వేలు నిజమయ్యాయి. గతంలో ఐదు సందర్భాల్లో మిగతా సంస్థలకు భిన్నంగా దీని అంచనాలు, ఫలితాలకు దగ్గరగా ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమికి 359 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఈ అంచనాలకు అనుగుణంగా ఫలితాలు వచ్చాయి. 2024లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, గతేడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, అంతకు ముందు మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల సమయంలోనూ ఖచ్చితంగా అంచనా వేసింది. మధ్యప్రదేశ్‌లో అన్ని సర్వేలూ కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే.. యాక్సిస్ మై ఇండియా మాత్రం 140- 162 సీట్లు వస్తాయని జోస్యం చెప్పింది. అన్నట్టుగానే బీజేపీ 163 సీట్లతో మళ్లీ అధికారం నిలబెట్టుకుంది.ఎగ్జిట్ పోల్స్ ఎప్పుడూ ఓట్ల లెక్కింపు రోజున వాస్తవ ఫలితాలుగా మారనప్పటికీ, అవి ప్రజా చర్చను ప్రభావితం చేస్తూ, తుది తీర్పుపై ఉత్కంఠను పెంచుతాయి. ఇక బెంగాల్ విషయానికి వస్తే పీపుల్స్ పల్స్ సర్వే టీఎంసీకి 177 నుంచి 187, బీజేపీకి 95-110 స్థానాలు వస్తాయని అంచనా వేసింది. మ్యాట్రిజ్ సర్వే టీఎంసీ 125 నుంచి 140, బీజేపీ 146-161 చోట్ల విజయం సాధిస్తుందని పేర్కొంది. అయితే, పీ-మార్క్ సర్వే మాత్రం టీఎంసీ 118-138, బీజేపీ 150-175 స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. చాణక్య స్ట్రాటజీస్ కూడా బీజేపీకి ఛాన్స్ ఉందని వెల్లడించింది. బీజేపీకి 150-160 స్థానాలు, తృణమూల్ కాంగ్రెస్‌కు 130-140 స్థానాలు వచ్చే ఛాన్స్ ఉందని తెలిపింది. పోల్ డెయిరీ కూడా కమలం వికసిస్తుందని అంచనా వేసింది. టీఎంసీకి 99 నుంచి 127, బీజేపీకి 142 నుంచి 171, కాంగ్రెస్ 3 నుంచి 5 స్థానాల్లో విజయం సాధిస్తాయని చెప్పింది. జన్మత్ 195 నుంచి 205 స్థానాలు టీఎంసీకి, 80 నుంచి 90 స్థానాలు బీజేపీకి వస్తాయని అంచనా వేసింది. అలాగే, ఎన్డీటీవీ అంచనాలు కూడా టీఎంసీ 146, బీజేపీ 140, ఇతరులు 6 చోట్ల విజయం సాధించే అవకాశం ఉన్నాయని తెలిపాయి.మరి ఈసారి కూడా ఈ సంస్థ అంచనాలు నిజమవుతాయా? అనేది మే 4న తెలుస్తుంది. తమిళనాడు ఎన్నికల్లో తొలిసారి పోటీచేసిన విజయ్.. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. ఈ సర్వే అంచనా వేసినట్టు ఫలితాలు ఉంటే.. విజయ్ చరిత్రను తిరగరాయనున్నారు.ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్న సంస్థలు పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఓటింగ్ సరళిని అంచనా వేయడానికి ఈ పద్ధతులను అనుసరించాయి. ఎగ్జిట్ పోల్స్ అనేవి కేవలం సంకేతాలు మాత్రమే ఇవి ఎప్పుడూ కచ్చితంగా ఉంటాయని చెప్పలేం. అనేక సందర్భాల్లో ఎగ్జిట్‌పోల్ అంచనాలు లెక్క తప్పుతుంటాయి. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో ఒకట్రెండు మినహా మిగతా సర్వే సంస్థల లెక్కలు తెప్పాయి.

# విద్య, వైద్యం ఫ్రీగా ఇవ్వకుంటే రాళ్లతో కొట్టండి....

మీట్ ది ప్రెస్‌లో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత...
వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం...
మా నాన్న కేసీఆర్‌ను తిట్టలేదు..
బీఆర్ఎస్ అధ్యక్షుడిని విమర్శించా!
పాంచజన్యం అమలు చేయకుంటే గన్‌పార్క్ స్తంభానికి కట్టేసి కొట్టండి..
మీట్ ద ప్రెస్లో...టిఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు..






హైదరాబాద్, అక్షర సవాల్: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన "మీట్ ది ప్రెస్" కార్యక్రమంలో పాల్గొన్న కవిత, జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానమిచ్చారు. "తెలంగాణలో విద్య, వైద్యం ఫ్రీగా ఇవ్వకుంటే రాళ్లతో కొట్టండి. మా పాంచజన్యంలోని ఐదు అంశాలు అమలు చేయకుంటే గన్‌పార్క్ అమరుల స్థూపం స్తంభానికి కట్టేసి కొట్టండి" అని పిలుపునిచ్చారు. తన టార్గెట్ సర్వోదయ తెలంగాణ సాధించడమేనని, తెలంగాణ ప్రజలకు ఎవరైతే విలనో తనకు వాళ్లే విలన్ అని స్పష్టం చేశారు. తండ్రి కేసీఆర్‌తో తనకు ఎలాంటి పంచాయితీ లేదని, రాజకీయ నేత, బీఆర్ఎస్ అధ్యక్షుడిగానే ఆయనను విమర్శించానని తెలిపారు. కృష్ణా, గోదావరి నీళ్లను సరిగా వాడుకుని ఉంటే రైతుల చేతిలో రెండున్నర లక్షల కోట్లు ఉండేవి. కాళేశ్వరం, పాలమూరుకు లక్షా 21 వేల కోట్లు ఖర్చు చేసి లక్ష ఎకరాలకు మాత్రమే నీళ్లిచ్చారు.



కేటీఆర్ లాంటి ఐటీ మినిస్టర్ ఉండగా పదిసార్లు పేపర్ లీక్ ఎందుకైంది?" అని ప్రశ్నించారు. పార్టీ పేరు విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించామని, టీఆర్ఎస్ పేరు రావడం దైవ సంకల్పమేనని అన్నారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసే ముందు వివరణ కూడా అడగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా బిల్లు పాస్ కాకపోయినా 33 శాతం సీట్లు మహిళలకు కేటాయిస్తాం. వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించి తల్లి మాదిరి పాలన అందిస్తాం" అని కవిత పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం చేస్తున్న దుర్మార్గాన్ని ఖండిస్తున్నానని, లొంగిపోయిన మావోయిస్టులు టీఆర్ఎస్‌లో చేరాలని ఆహ్వానించారు. బీజేపీ, కాంగ్రెస్ విమర్శలను పట్టించుకోమని, తన వెనుక ఎవరూ లేరని, తన వెనుక తానే ఉన్నానని స్పష్టం చేశారు. కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్ట్ సుధాకర్ రెడ్డి మోడరేటర్‌గా వ్యవహరించగా, టీయూడబ్ల్యూజే అధ్యక్ష కార్యదర్శులు విరహత్ అలీ, రాం నారాయణ పాల్గొన్నారు.

# తండా నుండి ఖాకీ బాస్ దాకా

డీఎస్పీగా పదోన్నతి పొందిన అజ్మీర పెద్దన్న కుమార్
డీజీపీని కలిసిన పెద్దన్న.

హైదరాబాద్, మే 2 ములుగు జిల్లా మారుమూల గిరిజన గ్రామం నుండి వచ్చి పోలీస్ శాఖలో డీఎస్పీ స్థాయికి ఎదిగిన అజ్మీర పెద్దన్న కుమార్ విజయగాథ నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. సీఐ నుండి డీఎస్పీగా పదోన్నతి లభించిన సందర్భంగా రాష్ట్ర డీజీపీ డా. సీవీ ఆనంద్ ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా పెద్దన్న కుమార్, చిన్నప్పుడే తన పెదనాన్న కొడుకు, మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ గారి సహకారంతో హనుమకొండలోని ఎస్టీ హాస్టల్‌లో చేరి విద్యనభ్యసించారు. కష్టపడి చదివి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్ఐగా ఎంపికై, వరంగల్ ఉమ్మడి జిల్లాతో పాటు పలు చోట్ల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నిబద్ధతతో సేవలందించారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం 2026 ఏప్రిల్ 29న డీఎస్పీగా పదోన్నతి కల్పించింది. "నేను పడ్డ కష్టం మా తాండాలోని ఏ బిడ్డ పడవద్దు" అనే సంకల్పంతో డీఎస్పీ పెద్దన్న కుమార్ తన బంజారా కమ్యూనిటీలోని పేద విద్యార్థులకు హాస్టల్ ఫీజులు, పుస్తకాలు, పోటీ పరీక్షలకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్




మాట్లాడుతూ, "గిరిజన ప్రాంతాల నుండి వచ్చి ఉన్నత స్థాయికి చేరుకోవడం అభినందనీయం. పెద్దన్న కుమార్ వంటి అధికారులు శాఖకే వన్నె తెస్తారు" అని కొనియాడారు. "నా విజయం వెనుక మా అన్న సీతారాం నాయక్ కృషి, సేవాలాల్ మహరాజ్ దయ, నా తాండా ప్రజల ఆశీస్సులు ఉన్నాయి. ఈ పదోన్నతిని నా గోర్ బంజారా జాతికి అంకితం చేస్తున్నాను" అని నూతన డీఎస్పీ పెద్దన్న కుమార్ తెలిపారు.

# పెద్ద తండలో రిసెప్షన్ వేడుక

నూతన వధూవరులను ఆశీర్వదించిన డీసీసీ ఎస్టీ సెల్ చైర్మన్, సర్పంచ్ వినోదరవీందర్ నాయక్

సంగెశీ, అక్షర సవాల్: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు సంగెం మండలం పెద్ద తండ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన రిసెప్షన్ వేడుకలో డీసీసీ ఎస్టీ సెల్ చైర్మన్, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ గుగులోత్ వినోదరవీందర్ నాయక్ దంపతులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన గుగులోత్



పార్వతి - రాందన్ దంపతుల కుమారుడు సంతోష్ - అక్షిత వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరైన వినోదరవీందర్ నాయక్ దంపతులు నూతన వధూవరులకు అక్షతలు వేసి ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. వధూవరుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు కాంగ్రెస్ మూడు రంగులు వేయకపోతే బిల్లులు ఇవ్వట్లే

- మొదటి పేజీ తరువాయి

రంగుల నిబంధన పేరుతో అమలవుతున్న అప్రజాస్వామిక చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లకు ఎలాంటి పార్టీ రంగులు, ఎంబ్లెమ్‌లతో సంబంధం లేకుండా వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర నిధులను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటే సహించబోమని హెచ్చరించిన కొంగర రవి, జిల్లా అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని లబ్ధిదారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ప్రతి ఒక్కరూ స్వీయ జనగణన నమోదు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
జయశంకర్ భూపాలపల్లి

స్వీయ జనగణనలో ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మే 10వ తేది వరకు జరుగనున్న స్వీయ జనగణన కార్యక్రమంపై శనివారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు స్వీయ జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి అన్ని శాఖల వారీగా లక్ష్యాలను కేటాయించాలని అధికారులను ఆదేశించారు.నమోదుకు **https:// se.census.gov.in** లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర శాఖల సిబ్బంది, ప్రజలు నమోదు చేసుకోవాలని సూచించారు. స్వీయ గణన చేయడం వల్ల జనాభా గణన సులభతరం అవుతుందని తెలిపారు.జిల్లాలోని ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.మే 11 తరువాత ఇంటికి వచ్చే గణన అధికారికి సెల్ఫ్ ఎన్యూమ రేషన్ ఐడి చూపిస్తే అప్రూవ్ చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సీపీఓ జవహర్, ఆర్డీఓ హరికృష్ణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పంటమార్పిడి పాటిస్తేనే లాభం

**రైతులకు శాస్త్రవేత్త వెంకన్న సూచనలు**

**గీసుకొండ, మే 2 అక్షర సవాల్:** మండలంలోని మచ్చాపూర్ గ్రామంలో రైతులకు శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు "రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు" కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బోడకుంట్ల మానస ప్రకాష్ అధ్యక్షతన గ్రామ పంచాయితీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులతో నేరుగా చర్చించి కీలక సూచనలు అందించారు. ప్రధాన శాస్త్రవేత్త డా. వి. వెంకన్న మాట్లాడుతూ, యూరియాను అధిక మోతాదులో వాడటం వల్ల పంటలు చీడపీడలకు గురై సాగు ఖర్చులు పెరుగుతాయని హెచ్చరించారు. సూచించిన మోతాదులోనే ఎరువులు వినియోగించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, దీర్ఘకాలికంగా సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఒకే పంటను వరుసగా సాగు చేస్తే తెగుళ్లు, పురుగుల ఉధృతి పెరుగుతుందని, పంటమార్పిడి ద్వారా అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందవచ్చని



వివరించారు. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డా. జె. భార్గవి మాట్లాడుతూ, మార్కెట్లో మంచి ధరలు ఉన్న వంగడాలను ఎంపిక చేసుకొని సాగు చేస్తే లాభసాటి వ్యవసాయం సాధ్యమవుతుందని తెలిపారు. నీటి వినియోగాన్ని సమర్థంగా నిర్వహిస్తూ, సేంద్రియ పద్ధతులు అనుసరించి ఆర్గానిక్ సర్టిఫికేషన్ పొందితే అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. ఎన్ఎఫ్ఎస్ఎం కన్సల్టెంట్ సారంగం మాట్లాడుతూ, అధిక రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల హానికారక పదార్థాలు ఆహార గొలుసులోకి చేరి క్యాన్సర్ వంటి వ్యాధులకు దారితీస్తాయని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్ బాబు మాట్లాడుతూ, జీలుగ, పెసర వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేసి భూసారం పెంచుకోవాలని సూచించారు. నిషేధిత హెచ్‌టిబీటీ పత్తి విత్తనాలపై కఠిన చర్యలు ఉంటాయని, పారాక్వాట్ కలుపుమందు వినియోగాన్ని పూర్తిగా నివారించాలని స్పష్టం చేశారు. సర్పంచ్ మానస మాట్లాడుతూ, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు రైతులకు కొత్త వ్యవసాయ పద్ధతులు తెలుసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయని, మరిన్ని సమావేశాలు గ్రామాల్లో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ స్మిత, వార్డు సభ్యులు, ఇన్‌పుట్ డీలర్లు, అభ్యుదయ రైతులు, వ్యవసాయ విద్యార్థులు బి. శ్రీకాంత్, జి. ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

## గోనెసంచుల కోసం మొక్కజొన్న రైతుల ఆందోళన

**నల్లబెల్లి పిఎసిఎస్ కార్యాలయం ముట్టడి**

**నల్లబెల్లి, మే 02 అక్షర సవాల్:** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) కార్యాలయం ముందు మొక్కజొన్న రైతులు భారీగా ఆందోళనకు దిగారు. పండించిన మొక్కజొన్న రాశులు కళ్లముందే ఉండగా అమ్ముకునే పరిస్థితి లేకపోవడం తమను తీవ్రంగా కలచివేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం నాటినప్పటి నుంచి పంట కోత దాకా ఎన్నో కష్టాలు పడిన రైతులకు, చివరికి అమ్మకాల సమయంలో గోనెసంచుల కొరత పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. అవసరమైన సమయంలో గోనెసంచులు అందుబాటులో లేకపోవడంతో పంట నిల్వలు పేరుకుపోతున్నాయని, ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని విమర్శించారు. ఉదయం నుంచే పిఎసిఎస్ కార్యాలయం ఎదుట చేరిన రైతులు వెంటనే గోనెసంచులను సరఫరా చేయాలని, కొనుగోలు కేంద్రాలకు పంటను తరలించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## స్మశానానికి వెలుగు...

**రంగాపురంలో కరెంట్ పోల్స్ ఏర్పాటు, గ్రామ అభివృద్ధికి కొత్త దిశ**

**నల్లబెల్లి మండలం, మే 02 । అక్షర సవాల్** రంగాపురం గ్రామంలో మౌలిక వసతుల విస్తరణలో భాగంగా కీలక అడుగు పడింది. గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు ఆధ్వర్యంలో నూతన కరెంట్ పోల్స్ ఏర్పాటు కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఇప్పటివరకు విద్యుత్ సదుపాయం లేక స్మశాన వాటిక వద్ద అంత్యక్రియల సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, అక్కడికి ప్రత్యేకంగా కరెంట్ సరఫరా కల్పించేలా పోల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చర్యతో గ్రామ ప్రజలకు పెద్ద ఊరట లభించనుంది. ఇక గ్రామ డంపింగ్ యార్డ్‌కు కూడా విద్యుత్ సప్లై అందించే పనులు చేపట్టడం ద్వారా పరిశుభ్రత నిర్వహణ మరింత సులభం కానుంది. ఈ సందర్భంగా సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు మాట్లాడుతూ, గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సిబ్బంది, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొని సహకారం అందించారు.



## బాల కిషోర్ రెడ్డి ఫౌండేషన్ సేవ

# 3 వేల మందికి శీతల మజ్జిగ పంపిణీ

**కొమ్మాల అంగడిలో 'దాహ నివారణ సేవ'కు విశేష స్పందన**

**గీసుగొండ, మే 2 అక్షర సవాల్:** ఎండలు మండిపోతున్న వేళ ప్రజలకు చల్లని ఉపశమనం అందిస్తూ అల్లం బాల కిషోర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత 'శీతల మజ్జిగ పంపిణీ' కార్యక్రమం ఘన విజయాన్ని సాధించింది. కొమ్మాల అంగడి ప్రాంగణంలో జరిగిన ఈ 'దాహ నివారణ సేవ' కార్యక్రమం ప్రజల నుండి విశేష స్పందన పొందింది. ప్రియతమ నాయకుడు అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి ఆలోచనతో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమంలో దాదాపు 3,000 మందికి పైగా రైతులు, పశువుల వ్యాపారులు, ప్రయాణికులకు ఉచితంగా శీతల మజ్జిగ అందజేసి ఎండ వేడి నుండి ఉపశమనం కల్పించారు. జిల్లా నాయకులు, గీసుకొండ సర్పంచ్ వీరగోని రాజ్ కుమార్, అల్లం మర్రెడ్డి చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ జరగడం ప్రత్యేక ఆకర్షణగా




నిలిచింది. ప్రజలతో కలిసిమెలిసి సేవ చేయాలనే వారి తపన ఈ కార్యక్రమంలో ప్రతిఫలించింది. ఈ కార్యక్రమంలో కొమ్మాల సర్పంచ్ కన్నెబోయిన యమునా ప్రవీణ్, దశ్రుతండ సర్పంచ్ కేలోతు అమృత బిక్షపతి, సూర్య తండా సర్పంచ్ బాణోతు రాఘవేంద్ర, మాజీ ఎంపీటీసీ బానోతు శ్రీనివాస్, నాయకులు మాదాసి రాంబాబు, మొగసాని నాగదేవత సంపత్, తుప్పరి వికాస్, గాడిదుల బొంద్యాలు, బోయ అశోక్, తుప్పరి క్రాంతి, సాయిలీ మధు, బోగి శ్రీను, దౌడు రాజేష్, ధరంసోత్ వీరన్న, వాంకుడోత్ తిరుపతి, గూగులోతు రాజు, హార్యా తండా హరి నాయక్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి శనివారం ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రజా సేవలో భాగంగా ఆరోగ్యాన్ని కాపాడే దిశగా ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు ప్రశంసించారు.

## నీట్ పరీక్ష కేంద్రాల వద్ద ఖాకీ పహారా

**సీపీ సన్‌ప్రీత్ సింగ్ 163 సెక్షన్ విధింపు**

**వరంగల్ క్రైమ్, అక్షర సవాల్ :** ఆదివారం జరగనున్న 'నీట్–యూజీ' పరీక్షల నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 11 పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సీపీ సన్‌ప్రీత్ సింగ్ సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (పాత 144 సెక్షన్) నిషేధాజ్ఞలు విధించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రాలకు 500 మీటర్ల పరిధిలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అన్ని జిరాక్స్, ప్రింటింగ్ దుకాణాలను పూర్తిగా మూసివేయాలని సీపీ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ముగ్గురికంటే ఎక్కువ మంది గుమికూడటం, అనవసరంగా సంచరించడం నిషేధం. ఆంక్షలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి కేంద్రం వద్ద ఖాకీ పహారా ఏర్పాటు చేసినట్లు పోలీస్ శాఖ తెలిపింది.




## ఆర్ డబ్ల్యూ ఎస్ డిప్యూటీ ఈఈ జాటోత్ లక్ష్మణ్ నాయక్ పదవీ విరమణ



మార్కాపురం, మే 2 అక్షర సవాల్ : రూరల్ వాటర్ సప్లై అండ్ శానిటేషన్ (=ఔడా) శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా 40 ఏళ్ల సుదీర్ఘ సేవలందించిన జాటోత్ లక్ష్మణ్ నాయక్ విజయ దంపతులు శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత జీవనం కుటుంబ సభ్యులు సునీల్, రమేష్ తదితరులు లక్ష్మణ్ నాయక్ దంపతులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. మాకు అత్యంత ఆప్తులు, శ్రేయోభిలాషి, నిగర్వి, శాంత స్వభావులు, అందర్నీ ఆప్యాయంగా పలకరించే మహోన్నత వ్యక్తి లక్ష్మణ్ నాయక్ గారని,హోదా తలకెక్కనివ్వని నిగర్వం, చిరునవ్వుతో అందర్నీ పలకరించే ఆప్యాయతే ఆయనను అందరివాడిగా నిలిపాయి. 40 ఏళ్ల బాధ్యతలో నిజాయితీ, నిబద్ధత చూపారు. పదవి నుంచి విరమించినా ఆయనలోని మంచితనానికి విరామం లేదు" అని కుటుంబ సభ్యులు కొనియాడారు.ఈ కార్యక్రమం లో లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్, భూక్య జ్యోతి కృష్ణ, సుజాత పరశురాం, కోర్ర భారతి ధరమ్ సింగ్, లావుడియా సరిత గణేష్, భూక్య లావణ్య చరణ్ సింగ్, శిరీష రాందాస్, రేణుక రాజన్న, మౌనిక రమేష్, యశోద రాజన్న, సునీత చరణ్ సింగ్, మమ్మీ ధరమ్ సింగ్, సౌజన్య రవి, సుమలత సునీల్, దీపిక రాజేష్, లత అనిల్, అమల నాగరాజు, గంగోత్రి విమల్, నగేష్, రజిత రాకేష్, రితేష్, రోహిత్, అఖిల రాహుల్ సింగ్, నాగార్జున, రాహుల్, పృథ్వి, శశి, సురేష్ తదితరులు పాల్గొని లక్ష్మణ్ నాయక్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# "పురుగుమందుల లింకేజీ రద్దు చేయాలి"

**రైతు సంఘం వినతి**

**విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో పారదర్శకతకు సిపిఐ డిమాండ్**

**నల్లబెల్లి, మే 02 అక్షర సవాల్:** రాబోయే వ్యవసాయ సీజన్‌లో రైతులకు విత్తనాలు, కాంప్లెక్స్ ఎరువులు పురుగుమందులతో బలవంతపు లింకేజీ లేకుండా విక్రయించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఐ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. గత ఖరీఫ్, రబీ సీజన్లలో విత్తనాలు, ఎరువులతో పురుగుమందులను లింక్ చేసి విక్రయించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. అంతేకాకుండా, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు సమయానికి ఎరువులు సరఫరా చేయకపోవడంతో సమస్య మరింత తీవ్రమైందని పేర్కొంది. రాబోయే సీజన్‌లో రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందేలా చూడాలని విజ్ఞప్తి చేసింది. వ్యాపార సంస్థలు కూడా పురుగుమందుల లింకేజీ లేకుండా సరఫరా చేయాలని, లేకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇటీవల వ్యాపారులు కూడా ఈ సమస్యపై ఆందోళన వ్యక్తం చేస్తుండగా, వారికి సిపిఐ రైతు సంఘం మద్దతు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి మామిళ్ల పెద్ద ఐలయ్య, నాయకులు భూస కుమారస్వామి, గాదం రవి తదితరులు పాల్గొన్నారు.




## ధర్మారావు సేవాభావం... అభయ ఆంజనేయ ఆలయ నిర్మాణానికి రూ.51,116 విరాళం

**రాంపురంలో భక్తి జ్వాలలు... దేవాలయ నిర్మాణానికి దాతల స్పందన**

**గీసుగొండ, మే 2 అక్షర సవాల్:** గీసుకొండ మండలంలోని రాంపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న అభయ ఆంజనేయ స్వామి ఆలయానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గ్రామ ఆధ్యాత్మిక అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తున్న ఈ ఆలయ నిర్మాణానికి గీసుగొండ మాజీ జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు ఉదారంగా రూ.51,116 విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని రాంపూర్ సర్పంచ్ రడం భరత్, ఆలయ చైర్మన్ తాబేటీ వెంకటేశ్వర్లు, దర్శనాల కుమారస్వామి, గీసుగొండ మాజీ సొసైటీ చైర్మన్ రడం శ్రీధర్ తదితర గ్రామ ప్రముఖులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ధర్మారావు సేవా స్ఫూర్తిని కొనియాడుతూ అభినందనలు తెలిపారు. ఆలయ నిర్మాణం పూర్తి కావడం గ్రామానికి ఆధ్యాత్మిక శోభను తీసుకురావడమే కాకుండా భక్తులకు ఆరాధన కేంద్రంగా నిలుస్తుందని స్థానికులు పేర్కొన్నారు. ఈ మహత్తర సేవా కార్యక్రమంలో మరికొంతమంది దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేశారు. అభయ ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు అందరికీ లభించాలని, దాతల కుటుంబాలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



## పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం

**ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం**

**నల్లబెల్లి, మే 02 అక్షర సవాల్:** పేదల గృహ కలలకు మరొక చిరునామా చేరింది. నల్లబెల్లి మండలం నారక్కపేట గ్రామంలో ఓ పేద కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేరింది. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి చొరవతో ఆడిచర్ల మౌనిక--శ్రీనివాసులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరై, ఘనంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలోత్ చరణ్ సింగ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చిట్యాల తిరుపతి రెడ్డి ఈ గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేదల ఇల్లు కలలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత గృహం అందించేందుకు కృషి కొనసాగుతోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, ఇఫ్తార్, శేఖర్ గౌడ్, జెట్టి రామ్మూర్తి, కుంచాల రాజు, శ్రీపతి సుమన్, పోగుల కుమారస్వామి, వడ్లూరి రమేష్, సిద్ధ సంతోష్, సర్వేశం, దండెం రవీందర్, చిందం కుమారస్వామి, మామిడి కృష్ణ, తిప్పని లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## దాతల ఉదారత... అభయ ఆంజనేయ ఆలయ నిర్మాణానికి రూ.3.01 లక్షల విరాళాలు

**గీసుగొండ, మే 2 అక్షర సవాల్:** గ్రామంలో నిర్మాణంలో కొనసాగుతున్న అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణం, ప్రతిష్టాపన కార్యక్రమానికి దాతలు విశేషంగా ముందుకు వచ్చారు. ఒకేరోజు భారీగా విరాళాలు అందించడం గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని ప్రతిబింబించింది. మొదటగా గ్రామ సర్పంచ్ రడం భరత్ కుమార్ రూ.1,00,116 విరాళం అందజేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఆలయ చైర్మన్ తాబేటి వెంకటేశ్వర్లు రూ.50,116, తాబేటి వీరస్వామి రూ.50,116 విరాళాలను సమర్పించారు. ఇక గీసుగొండ మాజీ జడ్పీటీసీ పోలీసు ధర్మారావు రూ.51,116 విరాళం అందజేశారు. కీ.శే.



జన్నపురెడ్డి నారాయణరెడ్డి--విజయలక్ష్మి కుటుంబం రూ.25,000, గజ్జి రవి రూ.25,000 చొప్పున విరాళాలు ఇచ్చారు. ఈ రోజు మొత్తం రూ.3,01,464 విరాళాలు సమకూరాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు దాతల సేవాభావాన్ని కొనియాడుతూ, అభయ ఆంజనేయ స్వామి ఆశీస్సులు వారికి ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అందరూ ఏకమై ముందుకు రావడం శుభపరిణామమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

## కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది ఆ ఇద్దరే: ఎంపీ అర్వింద్



**హైదరాబాద్, మే 2**: కాంగ్రెస్ నేతలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరగడానికి కారణం తెలియక రాహుల్‌గాంధీ పిల్ల చేష్టలు చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఎంపీ మాట్లాడుతూ.. చెప్పులు, దుస్తులు సరిగా వేసుకోవడానికి రాని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష పార్టీ లీడర్ అనుకోవడానికి సిగ్గుగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక చేసిందేమీ లేదని విమర్శించారు. కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడంపైనే రేవంత్‌కు శ్రద్ధ అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేసీఆర్ కోవర్ట్ అని ఎంపీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క సివిల్ సప్లై శాఖలోనే అత్యంత అవినీతి జరుగుతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కేసీఆర్ కోవర్ట్‌లనే ఉద్యోగులుగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం కంటే భారీ అవినీతి.. ఉత్తమ్ శాఖలో జరుగుతోందని అన్నారు. కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## తండ్రిని విమర్శించడం కవితకు తగదు: దానం నాగేందర్



**హైదరాబాద్, మే2** : బీఆర్ఎస్ నేతలు కావాలనే రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలకు అత్యుత్సాహం ఎక్కువైందని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన వారే ఇప్పుడు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వానికి ఆర్థికభారం ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పుకొచ్చారు. రైతులకు ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తోందని.. గతంలో ఇవ్వకపోవడం కంటే ఇప్పుడు ఆలస్యంగానైనా ఇవ్వడం మంచిదే కదా అని చెప్పారు. ఎవరినీ వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టాలని ఈ ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్‌లో దానం నాగేందర్ ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజానాయకుడు.. ఆయన ప్రజల్లో ఉంటారని.. సందర్భాన్ని బట్టి బయటకు వస్తారని చెప్పుకొచ్చారు. కవిత కలలు కనాలి కానీ కబుర్లు చెప్పొద్దని ఎద్దేవా చేశారు. సొంత తండ్రిని విమర్శించడం ఆమెకు తగదని హితవు పలికారు. తల్లిదండ్రులను గౌరవించలేని వాళ్లు ఏం మనుషులని ప్రశ్నించారు. కవిత తన ఇంటి సమస్యను బయటకు తీసుకువస్తోందని అన్నారు. ఆమె రాజకీయంగా మాట్లాడాలి కానీ సొంత తండ్రిని విమర్శించడం ఏంటి? అని మండిపడ్డారు. కేసీఆర్‌ను కవిత డీ మోరల్ చేస్తూ.. పెద్దాయనను ఇబ్బంది పెట్టడం తగదని దానం నాగేందర్ పేర్కొన్నారు.

## ఐపీఎల్ వేళ యువత ఆ తప్పు చేయవద్దు: డీసీపీ అరవింద్ బాబు..



**హైదరాబాద్:** ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్స్‌తో మోసాలకు పాల్పడే కేటుగాళ్లపై ఉక్కుపాదం మోపుతున్నట్లు హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు తెలిపారు. సైబర్ పెట్రోలింగ్ పేరుతో సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్‌లో తప్పుడు ప్రచారాలపై నిఘా పెట్టినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్స్‌లో పెట్టుబడి పెట్టాలంటూ నకిలీ వెబ్ సైట్లు క్రియేట్ చేసి కేటుగాళ్లు ప్రచారం చేస్తున్నారని డీసీపీ పేర్కొన్నారు. ఐపీఎల్ సీజన్ నడుస్తున్నందున ఇలాంటి ప్రచారాలు జోరందుకున్నాయని తెలిపారు. అమాయకులను టార్గెట్ చేసి నిండా ముంచుతున్నారని చెప్పుకొచ్చారు. అలాంటి నేరగాళ్ల ఆట కట్టించేందుకే సైబర్ పెట్రోలింగ్ కార్యక్రమం చేపట్టినట్లు డీసీపీ అరవింద్ బాబు వెల్లడించారు. తప్పుడు ప్రచారం చేసే 427 సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను ఇప్పటివరకూ గుర్తించినట్లు డీసీపీ తెలిపారు. 1,903 పెయిడ్ ప్రమోషన్ అడ్వర్టైజ్మెంట్లను గుర్తించి తొలగించినట్లు అరవింద్ బాబు చెప్పుకొచ్చారు. వీటిని ఎక్కడి నుంచి, ఎవరు ఆపరేట్ చేస్తున్నారనే దానిపై పూర్తి దర్యాప్తు జరుగుతోందని వెల్లడించారు. యూజర్ డీటెయిల్స్ వచ్చిన తర్వాత ఎంత మంది ఆపరేట్ చేస్తున్నారనే దానిపై స్పష్టత వస్తుందని చెప్పారు. దీని వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై కూపీ లాగుతున్నట్లు పేర్కొన్నారు. మోసపోయిన బాధితులు ఇప్పటివరకూ ఎవరూ ఫిర్యాదు చేయలేదని డీసీపీ చెప్పుకొచ్చారు. నిందితులని గుర్తించే పనిలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

## తెలంగాణలో భారీగా పెరగనున్న మద్యం ధరలు!

**తెలంగాణలో మద్యం ధరలను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు**

**ప్రీమియం బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై రూ.100 వరకు పెంపు అవకాశం**

**పెరిగిన ఉత్పత్తి వ్యయంతో కంపెనీల నుంచి వస్తున్న ఒత్తిడి**

**ధరల నిర్ధారణకు ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు**

**ఈ పెంపుతో ప్రభుత్వానికి ఏటా రూ.3000 కోట్ల అదనపు ఆదాయం అంచనా**

తెలంగాణలో మద్యం ప్రియులకు త్వరలో షాక్ తగలబోతోంది. రాష్ట్రంలో మద్యం ధరలను పెంచేందుకు ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. పెరిగిన ఉత్పత్తి వ్యయం, డిస్టలరీల నుంచి వస్తున్న ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ నెలలోనే కొత్త ధరలపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ పెంపు అమలైతే ప్రీమియం బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై రూ.100 వరకు భారం పడొచ్చని అంచనా. గత ఏడాది కాలంగా మద్యం తయారీ కంపెనీలు ధరల పెంపు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడం, ముడిసరుకుల రవాణా ఖర్చులు, బాటిళ్ల తయారీకి వినియోగించే గ్యాస్ ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రతిపాదనలను పక్కన పెట్టింది. అయితే, ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు కంపెనీల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ధరల పెంపునకు సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ధరల నిర్ధారణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఎక్సైజ్ శాఖ ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వచ్చే వారం తొలిసారి సమావేశమై, వివిధ బ్రాండ్ల ధరల పెంపుపై కంపెనీలు సమర్పించిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించనుంది. అయితే, ధరలను భారీగా పెంచితే సామాన్యుల నుంచి వ్యతిరేకత వస్తుందని, గ్రామాల్లో అక్రమ గుడుంబా తయారీ పెరిగే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. అందుకే, మధ్యేమార్గంగా ధరలను సవరించాలని యోచిస్తున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం.. సాధారణ బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై రూ.60, ప్రీమియం బ్రాండ్లపై రూ.100, ఖరీదైన బ్రాండ్లపై రూ.120 వరకు పెరిగే అవకాశం ఉంది. ఈ ధరల పెంపు ద్వారా ప్రభుత్వ ఖజానాకు నెలకు అదనంగా రూ.250 కోట్లు, ఏడాదికి సుమారు రూ.3,000 కోట్ల ఆదాయం సమకూరుతుందని ఎక్సైజ్ అధికారులు లెక్కలు వేస్తున్నారు.

# జీవన్ రెడ్డిబాటలో కోమటిరెడ్డి..?

**హైదరాబాద్, మే 2:**తెలంగాణ కాంగ్రెస్ లో అసంతృప్తి త్వరలోనే బయట పడే అవకాశముంది. ఇప్పటికే కొందరు కాంగ్రెస్ పార్టీలోని కీలక నేతలు బీఆర్ఎస్ నేతలకు టచ్ లోకి వెళ్లారని చెబుతున్నారు. జీవన్ రెడ్డి బాటలోనే మరికొందరు కాంగ్రెస్ నేతలు నడుస్తారన్న ప్రచారం ఊపందుకుంది. తాజాగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారంపై కూడా అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆయన తనకు మంత్రి పదవి రాకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారు. నల్లగొండ జిల్లాలో ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉండటంతో పాటు తన సోదరుడు కూడా కేబినెట్ లో ఉండటంతో తనకు మంత్రి పదవి దక్కే ఛాన్స్ లేదనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. అందుకే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తరచూ సొంత పార్టీ పై వ్యతిరేకంగా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వ పాలనపై విమర్శలు చేస్తున్నారు. తనకు హైకమాండ్ ఇచ్చిన హామీని అమలు పర్చాలని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పదే పదే కోరుతున్నారు. కానీ సామాజికవర్గంతో పాటు కుటుంబంలో



ఒకరు మంత్రి పదవిలో ఉండటంతో ఆయనకు మంత్రి పదవి దక్కే ఛాన్స్ తక్కువేనన్నది అందరి అభిప్రాయం. మరొకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కూడా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సఖ్యత లేదు. అదే సమయంలో ఇక తనకు మంత్రి పదవి రాదని భావించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చివరి ఏడాది పార్టీ మారే యోచన చేస్తున్నారన్న టాక్ బలంగా వినపడుతుంది. ఇటీవల ఒక వివాహ వేడుకలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సఖ్యతగా కనిపించడం అనుమానాలను మరింత బలపరుస్తుంది. మరొకవైపు తాజాగా కల్వకుంట్ల కవితపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా ఆయన చేరిక బీఆర్ఎస్ లోకి అని అర్థమవుతుందంటున్నారు. తండ్రిని గౌరవించలేని కవిత తెలంగాణ ప్రజలకు తల్లి ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఒక ఉద్యమకారుడి బిడ్డగా ఆయనను గౌరవించాల్సిందిపోయి అవమానకర రీతిలో మాట్లాడటమేంటని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిలదీశారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్యమైన వ్యక్తి అని, కీలక పాత్ర పోషించారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనడంతో ఆయనపై అనుమానపు చూపులు పార్టీలో బయలుదేరాయి. మరి ఈ ప్రచారంలో నిజమెంత అన్నది తేలాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

# కుట్టుమిషన్ల పంపిణీలో అక్రమాలు..

**మెదక్, మే2:**ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి కుట్టుమిషన్ల పంపిణీపై అప్పుడే అనుమానాలు మొదలయ్యాయి. రూ.కోట్లు పక్కదారి పట్టించేందుకే ఇలాంటి పథకాలను తీసుకొస్తున్నారంటూ విమర్శలు వస్తున్నాయి. గతంలో పలు పథకాలను అమలు చేసే సందర్భంలో టెండర్ల నుంచి మొదలుకుని లబ్ధిదారుల ఎంపిక వరకు తీవ్ర విమర్శలు వచ్చిన సందర్భాలను వారు ఎత్తిచూపుతున్నారు. తాజాగా ప్రతి ని యోకవర్గానికి వెయ్యి కుట్టుమిషన్లను అందిస్తామంటూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొ న్నం ప్రభాకర్ ప్రకటించిన నేపథ్యంలో అం దరిలోనూ మరోసారి చర్చను రేకెత్తించింది. ఈ పథకంలోనూ అవినీతి, అక్రమాలు జరుగుతాయని కొందరు చర్చించుకుంటున్నారు. గతంలో పలు కొత్త పథకాలు అమలు చేయడంలో వచ్చిన ఆరోపణలు, లబ్ధిదారుల ఎం పిక, టెండర్ల ఎంపికలో వెల్లువెత్తిన అక్రమాలు, అవినీతి ఆరోపణలు వచ్చిన నేప థ్యంలో కుట్టుమిషన్ల పంపిణీలో ఇలాంటి వాటికి ఆస్కారం ఉండకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ సందర్భంగానే రాజకీయ విశ్లేషకులు, మేధావులు, ప్రజలు పలు సూచనలు చేస్తున్నారు. బీసీల్లోని నిరుపేదలకు కుట్టుమిషన్లన అందిం చాలనేది అందరూ స్వాగతిస్తున్న అంశమే. అయితే ఇలా కుట్టుమిషన్లను అందించే ప్రక్రియలో పారదర్శకత, మార్గదర్శకాల అమలు పైనే అందరూ చర్చిస్తూ అవినీతి, అక్రమాలకు ఇక్కడే శ్రీకారం చుడతారనే అనుమానా లను వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాలకుగాను ఒక్కో నియోజవర్గానికి వెయ్యి కుట్టుమిషన్లను అందించి.. బీసీ నిరుపేద కుటుంబాలకు ఉపాధిని పెం పొందించేలా చూడటానికి బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కుట్టుమిషన్ల పంపిణీని చేపట్టనున్నారు. అంటే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.20 లక్షల కుట్టుమిషన్లను పం పిణీ చేయనున్నారు. వాస్తవానికి టెండర్ల విషయంలో ఏదైనా అవినీతికి ఆస్కారం కలుగుతుంది. టెండరుదారుల అర్హతలను నిర్ణయించడమే ఈ అక్రమాలకు శ్రీకారం చుడుతుంది. గతంలోలాగా ఆంధ్రాకు చెం దిన బడా కాంట్రాక్టర్లకు ఈ టెండర్లు దక్కేలాగా అర్హతలు ఉండకుండా కనీసం ఐదారు గురికి అదీ తెలంగాణవారికి టెండర్లు వచ్చేలాగా అర్హతలను నిర్ణయిస్తే అవినీతికి ఆస్కా రం



లేకుండా ఉంటుందని మేధావులు సై తం అంటున్నారు. అలాగే కుట్టుమిషన్లను సరఫరా చేసేవారిలో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) వారికికూ డా అవకాశం దక్కేలా చూడాలని వారంటున్నారు. దీంతోపాటు మహిళా వ్యాపారవే త్తలకు, 25 శాతం ఎస్సీ వ్యాపారవేత్తలకు టెండర్లు దక్కేలా మార్గదర్శకాలు రూపొందిస్తే స్థానికులకు వ్యాపార అవకాశాలు ఇచ్చి నట్టవుతుందని వారంటున్నారు. ఇక ఒక్కో కుట్టుమిషన్‌కు ధర ఎంత అనే ది నిర్ణయించడంలోనే అసలైన ఆరోపణలు వస్తాయని వారు సూచిస్తున్నారు. బహిరంగా మార్కెట్‌లో ఒక్కో కుట్టుమిషన్ ధర కంటే 1.20 లక్షల కుట్టుమిషన్లకు తక్కువ ధరకే వచ్చే అవకాశం ఉందని, ఇందుకోసం టెండరుదారులతో సమావేశం ఏర్పాటుచేసి ఎవరు తక్కువ ధరకు ఇస్తే వారికి టెండర్లు ఇవ్వాలని వారు సూచిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి (బీసీ సంక్షేమం) నిధులు మిగులుతాయని వారంటున్నారు. అలా కాకుండా గతంలో అనేక పథకాల విషయంలో జరిగినట్టుగానే ధరలను రెట్టింపు చేసి ప్రజా ధనాన్ని లూటీ చేసేలా లోపాయికారీ ఒప్పందాలకు వెళ్లకుండా చూడాలని వారం టున్నారు. ఇలా జరిగితే ప్రభుత్వంపై మరోసారి అవినీతి, అక్రమాల ఆరోపణలు, విమ ర్శలు రావడం ఖాయమని, దీనివల్ల ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి తలెత్తి అంతి మంగా ప్రభుత్వానికే నష్టం వాటిల్లుతుందని మేధావులు హెచ్చరిస్తున్నారు. దీనికితోడు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత అవసరమని ప్ర జలు అంటున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇతర పథకాల లబ్ధిదారుల ఎంపికలో వచ్చినట్టుగా అవినీతి ఆరోపణలు రాకుండా ఉండేలా బీసీల్లో ఉన్న కిందిస్థాయి వర్గాల నుంచి ఎంపిక జరగాలని వారంటున్నారు. రాజకీయ పక్షాల ప్ర భావం ఉండకుండా.. పారదర్శకంగా ఎంపిక ఉండాలని ప్రజలు కోరుతున్నారు. రైతు బంధులాగా నేరుగా బెనిఫిట్ ట్రా న్స్‌ఫర్ (డీబీటీ) విధానం అయితే మరీ మం చిదని మేధావులు సూచిస్తున్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసి వారి బ్యాంకు ఖాతా ల్లోకి కుట్టుమిషన్‌కు నిర్ణయించిన ధర మొ త్తాన్ని బదిలీ చేస్తే ప్రభుత్వం గుర్తించిన టెండరుదారుల నుంచి వారే నేరు గా కుట్టుమిషన్లను కొనుగోలు చేసే అవకాశం ఉంటుం ది. పైగా లబ్ధిదారుల అవసరాలమేరకు సొంతంగా మరికొం త డబ్బు కలిపి కొత్త కొత్త సౌకర్యాలతో ఉన్న కుట్టుమిష న్లు కొనుగోలు చేసుకునే అవకాశాం కల్పిస్తే మరింత ఉపయుక్తంగా ఉం టుందని ప్రజలు అంటున్నారు. ఇదీ కాకుం డా రాష్ట్రం మొత్తం ఒకరిద్దరు కాంట్రాక్టర్లకు అప్పజెప్పకుండా మొత్తం 33 జిల్లాలకు ఒకరిద్దరి చొప్పున కుట్టుమిషన్ల సరఫరాదారు లు ఉండేలా జాగ్రత్త వహిస్తే మరింత పారదర్శకంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకు లు అభిప్రాయపడుతున్నారు. జిల్లాల వారీ గా కాంట్రాక్టర్లను ఎంపికచేస్తే స్థానికంగా ఉండే ఎంఎస్ఎంఈలకు అవకాశంగా ఉం టుందని వారంటున్నారు. ఇక ప్రభుత్వం ఏం చేస్తుందో.. ఎలా చేస్తుందో.. చూడాలి..!అంతంత మాత్రంగానే ఉన్న బీసీ సంక్షే మ శాఖ బడ్జెట్ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల కుట్టుమిషన్ల పం పిణీ కోసం సుమారు రూ.100 కోట్ల వరకు ఖర్చు పెట్టాలనే ఆలోచనతో ప్ర భుత్వం ముందుకు వెళ్తున్నట్టు సమాచారం. ఒక్కో కుట్టుమిషన్‌కు సుమారు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు పెట్టే అవకాశం ఉంది. కాస్త అధునాతన సౌకర్యాలతో ఉండే కుట్టుమిష న్లను ఎంపిక చేసుకుంటే మరింత ఎక్కు వ ధర ఉండే అవకాశం ఉంది. మొత్తం గా సుమారు రూ.100 కోట్ల వరకు ఖర్చు చేసే ఈ కుట్టుమిషన్ల పంపిణీలో అవినీతికి, అక్రమాలకు తావీయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# దాగుడుమూతల కవిత




**హైదరాబాద్, మే 2:**రాజకీయాల్లో ఒక కొత్త పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే స్పష్టమైన అజెండా, అంతకంటే స్పష్టమైన పేరు ఉండాలి. కానీ, కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ విషయంలో మొదటి అడుగులోనే అయోమయం నెలకొంది. గత కొద్ది రోజులుగా తెలంగాణ రాష్ట్ర సేన పేరుతో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆవిష్కరణ కార్యక్రమాలు, సోషల్ మీడియా హంగామా చేసిన కవిత టీమ్, ఇప్పుడు అధికారికంగా తెలంగాణ రక్షణ సేన పేరును తెరపైకి తెచ్చింది. అసలు రాష్ట్ర సేన పేరు కోసం ఆమె దరఖాస్తు కూడా చేయలేదని వెల్లడికావడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది పాత టీఆర్ఎస్ సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకోవాలనే ఉద్దేశంతోనే ౹ు=ూ అనే సంక్షిప్త నామం వచ్చేలా రాష్ట్ర సేన పేరును కవిత ఎంచుకున్నారు. అయితే, బీఆర్ఎస్ నుండి వచ్చే తీవ్రమైన అభ్యంతరాలు, సాంకేతిక ఇబ్బందుల వల్ల ఆ పేరు దక్కదని ముందే గ్రహించి, సేఫ్ సైడ్‌గా రక్షణ సేన ను ప్రతిపాదించినట్లు కనిపిస్తోంది. కానీ, ప్రచారానికి ఒక పేరు, దరఖాస్తుకు మరో పేరు వాడటం ఆమె పార్టీ విశ్వసనీయతను దెబ్బతీసేలా ఉంది. పార్టీకి సంబంధించిన అన్ని సోషల్ మీడియా ఖాతాలను రాష్ట్ర సేన పేరుతోనే ప్రారంభించి, లోగోలు, జెండాలు కూడా అదే పేరుతో ఆవిష్కరించారు. ఇప్పుడు తీరా ఈసీ నుండి రక్షణ సేన పేరుతో పబ్లిక్ నోటీసు వచ్చేసరికి, కనీసం వివరణ ఇచ్చే ప్రయత్నం కూడా కవిత టీమ్ చేయలేదు. ఈ స్థాయిలో తడబాటు ఉంటే ప్రజలు పార్టీని ఎంతవరకు సీరియస్‌గా తీసుకుంటారనే చర్చ మొదలైంది. రాజకీయం అంటే కేవలం ఈవెంట్ మేనేజ్‌మెంట్ కాదని, ప్రతి అడుగులోనూ పారదర్శకత ఉండాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, కవిత పార్టీకి ఎన్నికల కమిషన్ ఇంకా అధికారిక గుర్తింపు ఇవ్వలేదు. కేవలం పేరు నమోదు కోసం అప్లికేషన్ పెట్టుకుంటే, అభ్యంతరాల స్వీకరణ కోసం ఈసీ నోటీసు ఇచ్చింది. ఇది ఒక ప్రాథమిక దశ మాత్రమే. కానీ, కవిత టీమ్ మాత్రం అప్పుడే ఈసీ ఆమోదం తెలిపేసిందని, తమదే అసలైన టీఆర్ఎస్ అని ప్రచారం చేసుకోవడం వారి అత్యుత్సాహానికి నిదర్శనం. అభ్యంతరాల స్వీకరణ తర్వాతే ఫైనల్ రిజిస్ట్రేషన్ జరుగుతుందనే కనీస అవగాహన లేకుండా ప్రకటనలు చేయడం ఆమెను రాజకీయంగా డిఫెన్స్‌లో పడేసింది. పార్టీ పేరు విషయంలో ఇంత భారీ వ్యత్యాసం ఉన్నప్పుడు, కనీసం తన అనుచరులకు లేదా ప్రజలకు క్లారిటీ ఇవ్వకుండా కవిత ఎందుకు దాగుడుమూతలు ఆడుతున్నారనేది మిస్టరీగా మారింది. అబద్ధపు ప్రచారంతో సెంటిమెంట్‌ను రగిల్చవచ్చని భావిస్తే అది వికటించే అవకాశం ఉంది. రాష్ట్ర సేన కాకపోయినా రక్షణ సేన అయినా టీఆర్ఎస్ వస్తుంది కదా అనే భావనలో ఉన్నారు. ఏదైనా కొత్త వ్యవస్థను ప్రారంభించేటప్పుడు పునాదులు బలంగా ఉండాలి. కానీ, కవిత పార్టీ ప్రారంభం నుండే అస్థిరమైన ప్రకటనలు, పేరు మార్పులు, సాంకేతిక లోపాలతో సాగుతోంది. ఈ గందరగోళం ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రజల నుండి ఆశించిన మద్దతు లభించడం కష్టమే. రాజకీయాల్లో బిగినర్స్ మిస్టేక్స్ సహజమే అయినా, పార్టీ పేరు వంటి అత్యంత ప్రాథమిక విషయంలోనే ఇన్ని తడబాట్లు రావడం కవిత రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తోంది.

## 90 ml ఎంత పని చేసింది?

**ముంబైలో మోగిన అలారం:కట్ చేస్తే హైదరాబాద్‌లో**




**హైదరాబాద్:**జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. మెట్రో స్టేషన్ కింద అడ్డా కూలీగా పని చేసే ఓ వ్యక్తి, మద్యానికి బానిసై ఏటీఎంను పగలగొట్టేందుకు యత్నించాడు. ఈ ఘటన రోడ్ నంబర్-5 వద్ద ఉన్న చెక్‌పోస్ట్ సమీపంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, కొత్తపల్లి వేణునంద అనే వ్యక్తి మద్యం మత్తులో ఏటీఎం వద్దకు వెళ్లి దానిని ధ్వంసం చేయడానికి ప్రయత్నించాడు. అయితే, ఏటీఎంలో అమర్చిన ఆధునిక సెక్యూరిటీ వ్యవస్థ వెంటనే స్పందించి అలర్ట్‌ను ముంబైలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయానికి పంపింది. అక్కడి నుంచి సమాచారం అందుకున్న అధికారులు తక్షణమే స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు చెప్పిన సమాధానం ఆశ్చర్యానికి గురిచేసింది. ”90 మిల్లీలీటర్ల మద్యం కోసం 90 రూపాయలు తీసుకోవాలనుకున్నాను” అని చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో, నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఏటీఎం భద్రతా వ్యవస్థలు ఎంత వేగంగా స్పందిస్తున్నాయో మరోసారి స్పష్టమైంది. చిన్న సమయంలోనే హెడ్‌క్వార్టర్స్‌కు సమాచారం చేరి, స్థానికంగా చర్యలు తీసుకోవడం టెక్నాలజీ సమర్థతకు నిదర్శనంగా నిలిచింది.

## భైంసాలో ఉచిత మజ్జిగ పంపిణీ ప్రారంభం

**నిర్మల్/ భైంసా :** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల వల్ల కలిగే డీహైడ్రేషన్ సమస్యలను నివారించడంలో మజ్జిగ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రజలు ఈ సేవను వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

# ఆధ్యాత్మికతకు అన్నదానలకు పెట్టింది పేరు మన సిద్దిపేట

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**



**సిద్దిపేట:** రంగధాంపల్లి శ్రీ పంచవటి హనుమాన్ దేవాలయ అన్న ప్రసాద భవనం ను ప్రారంభించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సిద్దిపేట పట్టణం 3 వార్డ్ రంగదాంపల్లి లో శ్రీ పంచవటి హనుమాన్ దేవాలయం ప్రాంగణం లో నిర్మించిన అన్న ప్రసాద భవనంను ప్రారంభించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. ఈ సందర్భంగా మాట్లాడుతు సిద్దిపేట అన్నదానాలకు పెట్టింది పేరన్నారు ఆధ్యాత్మికతకు అన్నదానలకు నెలవు గా మారిందన్నారు. హనుమాన్ దీక్ష బిక్ష కు బీజం వేసింది మన సిద్దిపేటనేన్నారు రావి చెట్టు హనుమాన్ దేవాలయం లో 41రోజులు, గణేష్ నగర్ హనుమాన్ దేవాలయం లో 21రోజులు, పంచముఖ హనుమాన్ దేవాలయం లో 21 రోజులు బిక్ష కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. రావి చెట్టు హనుమాన్ దేవాలయం, గణేష్ నగర్ హనుమాన్ దేవాలయం, నేడు రంగాధంపల్లి లో ప్రారంభం చేసుకున్నం సిద్దిపేట లో చేసిన అన్ని భవనాలకు నా సహకారం అందించానని చెప్పారు.

# కేసీఆర్ సర్జికల్ స్ట్రైక్....

- మొదటి పేజీ తరువాయి

కొన్ని సందర్భాలలో ఆయన అంచనాలు తప్పవచ్చు. కానీ మెజారిటీ సందర్భాలలో ఆయన అంచనాలు ఏమాత్రం తప్పలేదు.కెసిఆర్ ఇప్పుడు ఒక రకమైన సంధి దశను ఎదుర్కొంటున్నారు. బహుశా ఆయన రాజకీయ జీవితంలో ఏనాడు కూడా ఇలాంటి స్థితిని ఎదుర్కొని ఉండకపోవచ్చు. అంతటి తెలంగాణ ఉద్యమంలో కూడా కేసీఆర్ ఒత్తిడి ఎదుర్కొన్నప్పటికీ.. బలంగా నిలబడ్డారు. స్థిరంగా అడుగులు వేశారు. ఉద్యమాన్ని బలోపేతం చేసే దిశగా కార్యచరణ రూపొందించారు. అందువల్లే ఆయనను ఇప్పటికీ తెలంగాణ ప్రజలు నమ్ముతుంటారు. ఆయన మాటలను వింటారు కేసీఆర్ కుటుంబంలో పరిస్థితి ఏమాత్రం బాగోలేదు. ముఖ్యంగా కన్న కూతురు కేసీఆర్ వ్యవహార శైలిని ప్రశ్నిస్తున్నారు. కెసిఆర్ నాయకత్వాన్ని ఎదిరించారు. కెసిఆర్ పరిపాలన కాలంలో జరిగిన లోపాలను ఎత్తిచూపుతున్నారు. సహజంగానే ప్రశ్నించే స్వభావాన్ని కెసిఆర్ తట్టుకోలేరు. అందువల్లే తనకు వ్యతిరేకంగా మాట్లాడిన ఎవరిని కూడా పార్టీలో ఉంచుకోలేదు. చివరికి కన్న కూతురిని సైతం బయటికి పంపించారు కేసీఆర్. ఇటీవల కాలంలో కేసీఆర్ ను రేవంత్ కూడా విమర్శించని స్థాయిలో కవిత విమర్శిస్తోంది. ఏకంగా కేసీఆర్ ను ఉద్దేశించి మరమనిషి అని వ్యాఖ్యానించింది. మన మనిషి కాదని ఓపెన్ గానే చెప్పేసింది. కెసిఆర్ చుట్టూ పందికొక్కులు ఉన్నాయని.. తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. నిజంగా కేసీఆర్ గురించి ఈ స్థాయిలో మాట్లాడటం.. అది కూడా కవిత మాట్లాడటం గులాబీ పార్టీ శ్రేణులకు ఏమాత్రం రుచించడం లేదు.అటు కవిత చేస్తున్న విమర్శలు.. పార్టీకి ఎదురవుతున్న వరుస ఓటములు.. ఇవన్నీ



కూడా కేసీఆర్ ను ఆలోచింపజేశాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అందువల్లే ఆయన మునుపటి స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు అడుగులు వేస్తున్నారు. అందువల్లే ఇటీవల జరిగిన సమావేశంలో పార్టీకి సంబంధించిన రాష్ట్రస్థాయి కమిటీ మినహా.. మిగతా అన్నింటిని రద్దు చేశారు. పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చే బాధ్యతను కేటీఆర్ కు అప్పగించారు. అదే కాదు గోడమీద పిల్లి లాగా వ్యవహరిస్తున్న నాయకులను బయటకు వెళ్లిపోవాలని హెచ్చరించారు. పార్టీలో ఉంటూ.. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారందరిని వెళ్లిపోవాలని మొహమాటం లేకుండా చెప్పేశారు. అంతేకాదు సోషల్ మీడియాలో మాత్రమే యాక్టివ్గా ఉంటూ.. ప్రజా క్షేత్రంలో అంతగా కనిపించని నాయకులకు ఈసారి టికెట్లు ఇచ్చేది లేదని కెసిఆర్ స్పష్టం చేశారు. "ముఖం చూసి టికెట్లు ఇచ్చేది ఉండదు. ప్రజాక్షేత్రంలో ఎవరైతే మెరుగ్గా పనిచేస్తారో వారికి మాత్రమే టికెట్లు ఇస్తాం. సిఫారసులతో వచ్చినప్పటికీ కూడా అవకాశం ఉండదు. సోషల్ మీడియాలో హంగామా చేసే వారికి పార్టీ టికెట్లు ఇచ్చేది ఉండదని" కెసిఆర్ స్పష్టం చేశారు.ఇటీవల మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిశారు. ఆ వ్యవహారం కాస్త మీడియాలో విపరీతమైన చర్చకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ఆ తరహ నాయకులు పార్టీలో ఉండడం కంటే వెళ్లిపోవడం మంచిదని కెసిఆర్ నేరుగానే చెప్పేశారు.. ఈ ప్రకారం ఆ తరహా నేతలకు తన పార్టీలో చోటు లేదని.. ఒకవేళ ఉన్నా.. అటువంటి వారికి టికెట్లు ఇచ్చేది లేదని కెసిఆర్ స్పష్టం చేశారు.. అయితే సోషల్ మీడియాలో హంగామా చేస్తున్న నేతల మీద కేసీఆర్ గట్టిగానే ఫోకస్ పెట్టినట్టు తెలుస్తుంది.. ఎందుకంటే సోషల్ మీడియాలో హంగామా చేశారు నాయకులు ప్రజలకు దూరంగా ఉంటున్నారు. అటువంటి వారికి టికెట్లు ఇచ్చి ఓడిపోవడం కంటే.. ఇవ్వకపోవడమే ఉత్తమం అన్నట్టుగా కెసిఆర్ వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. కేటీఆర్ కు దగ్గరగా ఉండే నాయకులు సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారాన్ని కోరుకుంటారు. సోషల్ మీడియాలో అడ్డగోలుగా కామెంట్లు చేస్తూ ప్రచారంలో ఉంటారు. అయితే వారందరికీ చెక్ పెట్టే విధంగా కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.. ఒక రకంగా కెసిఆర్ మాట్లాడిన మాటలు గులాబీ పార్టీలో సర్జికల్ స్ట్రైక్ లాగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కెసిఆర్ తీసుకున్న ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తే.. పార్టీ మునుపటి వైభవాన్ని సాధించడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మా లక్ష్యం సర్వోదయ తెలంగాణ

- మొదటి పేజీ తరువాయి

వేసిన తర్వాతే మేము ప్రకటించాం. 20 ఏళ్లుగా మీరు నన్ను చూస్తున్నారు. ఇచ్చిన మాట, పట్టిన తోవను విడవకుండా ఉన్న వ్యక్తిని. ఇక వైద్యం విషయంలో కూడా ప్రజల డబ్బంతా దానికే ఖర్చు అవుతుందని అన్నారు.ఆరోగ్యశ్రీలో ఇప్పుడు 10 లక్షల వరకు ఇస్తున్నారు. కానీ మొదట్లో 2 లక్షల రూపాయలే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కానీ ఇప్పుడు 10 లక్షలు ఇవ్వటం కూడా సాధ్యమవుతుంది. ఆరోగ్య శ్రీ దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. విద్యార్థులకు ఫ్రీ మీల్స్ ఉంటే కూడా సాధ్యమా అన్నారు. కానీ అది కూడా సాధ్యమైంది. మన రాష్ట్రంలో క్యాన్సర్ వస్తే డబ్బులు లేక వైద్యం అందక చాలా మంది చనిపోతున్నారు. మూడు లక్షల రూపాయలు కూడా లేక క్యాన్సర్ పేషెంట్లకు వైద్యం చేయించకుండా చాలా కుటుంబాలు సరిపెట్టుకుంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల లైఫ్ స్పాన్ పెరుగుతుంటే మనం మాత్రం ఎందుకు ఇలా ఉండాలి? ఎన్ని లక్షలు ఖర్చైనా సరే తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం తెలంగాణ బిడ్డల వైద్యం కోసం వెనుకడుగు వేయదు. ఇక రైతు లేనిదే మనకు జీవితం లేదు. అలాంటి రైతుకు గౌరవం దక్కాలి. తెలంగాణలో రైతన్నకు ఆత్మగౌరవం కోసం తెలంగాణ రక్షణ సేన అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికీ కల్లాల దగ్గరే వడ్లు ఉన్నాయి. కొనుగోలు కేంద్రాలు తెరవమని రైతులు ధర్నా చేయాల్సిన పరిస్థితి. అసలు రైస్ ను ఎగుమతి చేసే పరిస్థితి ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. అందుకోసం ఒక కమిటీ ఏర్పాటు చేసి రైతుల పండించే బియ్యాన్ని ఎక్స్ పోర్ట్ చేయవచ్చు. జనంబాటలో మేము ఒక రైతును కలిశాం. నాలుగు రోజులుగా మక్కాలు కొనటం లేదంటూ కొనుగోలు కేంద్రం వద్దనే ఉన్నానని చెప్పారు. ఆ మరుసటి రోజే ఆ రైతు అదే మక్క కుప్పపై కుప్పకూలి చనిపోయాడు. అంటే మన దేశంలో రైతు ప్రాణానికి విలువ లేకుండా పోయింది. ఆ సంఘటన ఇప్పటికీ కూడా నన్ను కలవరపాటుకు గురిచేస్తోందని అన్నారు.రైతన్నలకు మేలు చేసే విషయంలో మేము చాలా సీరియస్ గా పనిచేస్తున్నాం. ఇక మేము ఎంచుకున్న మరో అంశం ఉపాధి. మన రాష్ట్రంలో ఉపాధి అంటే ఒక జోక్ అయిపోయింది. యూత్ ఏం కోరుకుంటున్నారో ప్రభుత్వానికి అర్థం కావటం లేదు. ఇతర దేశాల్లో ప్రభుత్వాలు అక్కడి యూత్ ఆలోచనలు ప్రోత్సహిస్తుండటంతో తక్కువ వయసులోనే వారంతా మిలియనీర్లు అవుతున్నారు. 18-25 ఏళ్ల లోపు ఉన్న జెన్ జీ ని నేను నమ్ముతున్నా. వారి ఆలోచనకు అండగా నిలవాలని మేము అనుకుంటున్నాం. జెన్ జీ తో పాటు 25-45 ఏళ్ల లోపు పాటు మంచి ఆలోచన తో వస్తే వారికి ప్రభుత్వమే 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణం ఇస్తుంది. యువత జాబ్ చేయటం కాదు. జాబ్ ఇచ్చేలా సిద్ధం కావాలి. మన దగ్గర నుంచి కూడా ఒక గూగుల్, వాట్సాప్ లాంటి సంస్థలు రావాలి. మన రాష్ట్రంలో అన్ని సంస్థల నుంచి కూడా పదివేల కోట్ల ఆదాయం రావటం లేదు. ప్రభుత్వం దీనిపై సరైన దృష్టి పెడితే ఒకటి, రెండు కంపెనీలు సక్సెస్ అయిన సరే రాష్ట్రానికి చాలా ఆదాయం వస్తుంది. ఉద్యోగాలకు సంబంధించి మొన్న నేను 4 లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ అంటే చాలా ప్రశ్నలు వచ్చాయి. కానీ ఎస్సీ, ఎస్టీ, ఫిజికల్లీ హ్యాండిక్యాప్ బ్యాక్ లాగ్ పోస్టులు చాలా ఖాళీ ఉన్నాయి. వాటన్నింటినీ నింపి ప్రభుత్వ శాఖలను బలోపేతం చేయాల్సి ఉంది. ఇక సీనియర్ సిటిజన్స్ కోసం కూడా మన దేశంలో ఒక శాఖ ఉండాలని అన్నారు.సీనియర్ సిటిజన్స్ కు ఉన్న హక్కులకు సంబంధించి పోలీసులకు కూడా అవగాహన లేదు. వారి కంప్లైట్ ఇస్తే దాన్ని ప్రత్యేకంగా టేకాఫ్ చేయాల్సి ఉంటుంది. 65 ఏళ్లు దాటి రిటైర్డ్ అయిన ఐఏఎస్, ఐపీఎస్ లకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదు. మంచి ఆరోగ్యం, ఆలోచన విధానం ఉన్న వాళ్లకు రుణాలు ఇవ్వకపోవటం దారుణం. మా ప్రభుత్వం వచ్చాక సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అదే విధంగా నాలుగు లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు కావాల్సిన అన్ని ప్రణాళికలు మా వద్ద ఉన్నాయని వెల్లడించారు.

# హుస్నాబాద్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొన్నం**

**హుస్నాబాద్:** ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని ఆర్డీఓ చదివి వినిపించారు. నియోజకవర్గ స్థాయి చేపట్టిన ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని వినిపించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలనుద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. ప్రజా ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాల ఐదు నెలల పాలనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మరియు రాష్ట్ర మంత్రుల సహకారంతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నియోజకవర్గంలో విజయవంతంగా అమలు చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకున్నామని అన్నారు. 250 కోట్ల రూపాయల రైతు భరోసా నిధులను రైతులకు అందించామని, మరణించిన 679 మంది రైతు కుటుంబాలకు 49 కోట్ల 96 లక్షల రూపాయల రైతు బీమా అందించామని, 150 కోట్ల రూపాయలతో 3,515 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా కొన్ని ఇలా నిర్మాణాలు పూర్తిగా మరికొన్ని వివిధ నిర్మాణ దశలో ఉన్నాయని ఇప్పటివరకు 74 కోట్ల రూపాయలు లబ్ధిదారులకు వివిధ దశలలో చెల్లించడం జరిగిందని తెలిపారు. 57,963 గృహాలకు 200 యూనిట్ల



ఉచిత విద్యుత్, 45 వేల మందికి పింఛను అందిస్తున్నామని పది సంవత్సరాలు కొత్త పింఛన్లను మంజూరు చేయలేదని త్వరలోనే కొత్తగా మరింత మందికి పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కొత్తగా 13000 మందికి రేషన్ కార్డులను మంజూరు చేసి వాటిలో నమోదైన 38 వేలమందికి మరియు పాత కార్డులలో 23 వేల మందిని అదనంగా చేర్చి మొత్తం 61 వేల మందికి ప్రతినెల 6 కిలోల సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉపాధిని కల్పించడమే కాకుండా పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి డబుల్ వెల్ఫేర్ ఎస్సీ సభ్యులను ద్వారా రోడ్లను అభివృద్ధి చేశామని, కొత్తపల్లి నుండి హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయని హుస్నాబాద్ నుండి అక్కన్నపేట వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి టెండర్లు పిలిచామని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి నిర్మాణం తన బాధ్యత అని భూ నిర్వాసితులకు త్వరలోనే పేమెంట్ చేసి కాల్వల నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. కోహెడ మండలం తంగేళ్లపల్లిలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం వేగంగా జరుగుతుందని, హుస్నాబాద్ పట్టణంలో శాతవాహన ఇంజనీరింగ్ కాలేజీ గత ఏడాది ప్రారంభమైందని కాలేజీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరిగిందని, మెన్ కు, ఉమెన్ కు ప్రత్యేకంగా హాస్టల్ నిర్మాణం చేస్తామని తెలిపారు. హుస్నాబాద్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా ఎల్లమ్మ చెరువు, అర్బన్ పార్క్, పట్టణ సుందరికరణతో పాటు నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్నామని, విద్యాభివృద్ధిలో భాగంగా ఏటిసి సెంటర్ నిర్మాణం, న్యాక్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని, 250 పడకలతో ఆసుపత్రి అభివృద్ధి చెందుతుందని మెడికల్ కాలేజ్ కూడా సాంక్షన్ చేసుకొని పీజీ తో ప్రారంభిస్తామని అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం 540 హోటల్లలో మరియు 250 స్వయం సహాయక సంఘాలకు స్టీల్ బ్యాంకులను పంపిణీ చేశామని వాటిని ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# జూన్2 నాటికి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

- మొదటి పేజీ తరువాయి



మంత్రి సొసైటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మూడు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని, అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలో సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెబుతూ ఎలాంటి విమర్శలకు, అనుమానాలకు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారికి సూచన ప్రాయంగా వెల్లడించి సొసైటీలో ఒక తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. 18 సంవత్సరాల క్రితమే ఇంటి స్థలాల కోసం ప్రతిసభ్యుడు రెండు లక్షల రూపాయిల చొప్పున చెల్లించారని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల స్థలాల కేటాయింపులో తమ సొసైటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సభ్యులు మంత్రిని కోరారు.సమావేశంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమీషనర్ జి. ముకుంద రెడ్డి, సిపీఆర్‌వో మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

# మే నెలలో ఎండలు, వడగాల్పుల తీవ్రత

- మొదటి పేజీ తరువాయి

తీవ్రత సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని మృత్యుంజయ్ తెలిపారు.ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని దిగువ ప్రాంతాల్లో ఎండల తీవ్రత పెరుగుతుంది ఐఎండీ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో సముద్రపు తేమతో కూడిన వేడి గాలి ఎక్కువగా ఉక్కపోత ఉండొచ్చని చెప్పింది. గుజరాత్, మహారాష్ట్రలోని విదర్భ, మరాఠ్వాడా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటే అవకాశం ఉందని వివరించింది.ఈసారి మే నెలలో పగటి పూట మాత్రమే కాదు, రాత్రి సమయాల్లో కూడా వేడి ఎక్కువగా ఉంటుందని ఐఎండీ వెల్లడించింది. దేశంలోని మెజారిటీ ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు (రాత్రి వేళలు) సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని చెప్పింది. దీనివల్ల రాత్రిపూట కూడా ఉక్కపోత అధికంగా ఉంటుందని వెల్లడించింది. పంజాబ్, రాజస్థాన్లోని కొంత భాగం, మధ్య భారతం, దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా లేదా అంతకంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వివరించింది.ఇదే సమయంలో నైరుతి రుతుపవనాలపై కూడా ఐఎండీ చల్లటి కబురు అందించింది. ఈసారి నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చే అవకాశం ఉందని, మే 14 నుంచి 16వ తేదీ మధ్యలో రుతుపవనాలు అండమాన్, నికోబార్ దీవులను తాకే అవకాశం ఉందని చెప్పింది. ఇది సాధారణ సమయం కంటే కొంచెం ముందే కావడం గమనార్హం. దీంతో మే నెలలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రాలు, పశ్చిమ భారతంలో మంచి వర్షాలు కురిసినప్పటికీ, ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని తెలిపింది.

## ఈ నెల 10 న ప్రధాని

# తెలంగాణ పర్యటన

- మొదటి పేజీ తరువాయి

ప్రారంభించనున్నారు. అదేవిధంగా హఫీజ్పేట్, జోగులాంబ ప్రాంతాల్లో రైల్వే స్టేషన్లు, జాతీయ రహదారుల అభివృద్ధి వంటి కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. భవిష్యత్తులో వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ, ఎయిర్పోర్ట్ వంటి మరిన్ని ప్రాజెక్టులు కూడా రాబోయే దశలో అమలులోకి తీసుకువస్తారని అన్నారు.ఇక రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దుర్భరంగా మారింది. నెల మొదటి తేదీకి జీతాలు అందకపోవడం, టీచర్లకు వేతనాలు ఆలస్యమవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. 2015 తర్వాత పీఆర్సీ బకాయిలు ఇంకా పెండింగ్లోనే ఉన్నాయి. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన ప్రయోజనాలు కూడా ఆలస్యంగా అందుతున్నాయి. హైకోర్టు జోక్యం చేసుకున్న తర్వాతే, నాలుగు వారాల్లోగా ఇవ్వాల్సిందేనని కోర్టు మొట్టికాయలు వేస్తే గాని కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం రాలేదు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా చూపిస్తుంది.ఆర్టీసీ ఉద్యోగుల విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి. ఉద్యోగులను కార్పొరేషన్ సిబ్బందిగా కాకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలి. గత ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేదు. ఇప్పుడు ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే మార్గంలో నడవకూడదు. ప్రకటనలు చేయడం కాకుండా, వెంటనే అమలు చేయడం అవసరం. కార్మిక సంఘాల పోరాటంతో ప్రభుత్వం కొంత వెనక్కి తగ్గి ప్రకటన చేసినప్పటికీ, పూర్తి స్థాయిలో అమలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు.

అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు విషయంలో ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ప్రజలు ఇప్పటికీ ఆ హామీల అమలుకై ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా రైతుల పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉంది. నేను స్వయంగా పలు వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించాను. అక్కడ వరి ధాన్యం కుప్పలుగా పేరుకుపోయి ఉండటం, వర్షాల వల్ల పంట నష్టపోవడం వంటి దృశ్యాలు కనిపించాయి. సరైన సమయంలో లారీలు, ట్రక్కులు అందుబాటులో లేకపోవడం వల్ల ధాన్యం లిఫ్టింగ్ ఆలస్యమవుతోంది.కొన్ని చోట్ల రైస్ మిల్లర్లు, మధ్యవర్తులు మరియు కొందరు అధికారులు కలిసి రైతులను నష్టపరుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర (మీఎ్రా) కంటే తక్కువ ధరకు రైతులు తమ పంటను అమ్ముకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇది పూర్తిగా అన్యాయం. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతుల సమస్యలను పరిష్కరించాలి.వరి రైతులే కాకుండా, మొక్కజొన్న రైతులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి పంటలను కూడా ప్రభుత్వం మీఎ్రా ప్రకారం కొనుగోలు చేయాలి. రైతులకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. కాబట్టి రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం...

- మొదటి పేజీ తరువాయి

మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం. కుట్టు మిషన్ల ద్వారా మైనారిటీ అక్కచెల్లెళు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలి. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే ప్రభుత్వం మాది. కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌తో ఆడపిల్లల పెళ్లిళ్లకు అండగా నిలుస్తున్నాం. 99 రోజుల్లోనే వరంగల్ తూర్పు రూపురేఖలు మారుతున్నాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి,బల్దియా అదనపు కమిషనర్ చంద్రశేఖర్, కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, చింతాకుల అనిల్ కుమార్, కావేటి కవిత, పోశాల పద్మ, భోగి సువర్ణ, బైరబోయిన ఉమా, పల్లం పద్మ, దిడి కుమారస్వామి, వస్కుల బాబు, మరుపల్ల రవి, ముష్కమల్ల అరుణ తదితరులు పాల్గొన్నారు.



# రోజ్ ఆపిల్ వేసవి కాలంలో ప్రత్యేకమైన పండు

కాలానుగుణంగా అనేక రకాల పండ్లు లభిస్తాయి. వేసవికాలం అనగానే అందరికీ ముందుగా మామిడిపండ్లు గుర్తుకువస్తాయి. కానీ మామిడిపండ్లు మాత్రమే కాకుండా వేసవికాలంలో అనేక రకాల ఇతర పండ్లు కూడా లభిస్తాయి. వాటిలో రోజ్ ఆపిల్ కూడా ఒకటి. రోజ్ ఆపిల్ లేదా సఫేద్ జామున్ వేసవి కాలంలో లభించే ప్రత్యేకమైన పండు. ఇది సుమారు 93 శాతం నీటిని కలిగి ఉండడంతో శరీరానికి సహజమైన హైడ్రేషన్‌ను అందిస్తుంది. దేశంలోని తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా కనిపించినప్పటికీ మార్కెట్లో ఇది తక్కువగా వినియోగంలో ఉంది. ఈ పండులో తక్కువ క్యాలరీలు (10 గ్రాములకు 25-30 క్యాలరీలు) ఉండటం వల్ల దీన్ని తేలికపాటి ఆహారంగా పరిగణిస్తారు. అంతేకాకుండా ఫైబర్ సమృద్ధిగా ఉండటం వల్ల జీర్ణక్రియకు మేలు చేస్తుంది. విటమిన్ సి, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు వంటి సూక్ష్మపోషకాలు శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి.

**శరీరాన్ని చల్లబరిచేందుకు..**


రోజ్ ఆపిల్ పండు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటుంది. ఇది శరీర ఉష్ణోగ్రతను తగ్గించే బ్లడ్ కూలెంట్ గా సంప్రదాయ వైద్యంలో ఉపయోగంలో ఉంది. వేసవిలో దాహాన్ని తగ్గించి, శరీర ద్రవ సమతుల్యతను నిలబెట్టడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. తక్కువ క్యాలరీలు, అధిక ఫైబర్ కారణంగా బరువు నియంత్రణలో కూడా ఉపయోగపడుతుంది. అలాగే ఇది స్వల్ప విరేచన లక్షణాలతో జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. దేశంలో అధిక ఉష్ణోగ్రతలు (40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా) నమోదయ్యే వేసవిలో డీహైడ్రేషన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సహజ పండ్ల వినియోగం ముఖ్యమవుతుంది. ప్యాకేజ్డ్ జ్యూసులు, చక్కెర పానీయాల బదులు రోజ్ ఆపిల్ వంటి పండ్లు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తాయి. అయినప్పటికీ ఇది అన్ని ప్రాంతాల్లో సులభంగా లభ్యం కాకపోవడం ఒక సమస్యగా ఉంది.



## ఎలాగైనా తీసుకోవచ్చు..

రోజ్ ఆపిల్‌ను తినే విధానాలు కూడా సులభంగా ఉంటాయి. దీనిని చల్లగా నేరుగా తినవచ్చు. ఫ్రూట్ సలాడ్‌లో నిమ్మరసం లేదా ఉప్పుతో కలిపి తీసుకోవచ్చు. మింట్, కీరదోసతో కలిపి స్మూతీగా కూడా తయారు చేసుకోవచ్చు. అయితే పండిన, పాడైన పండ్లను తప్పనిసరిగా నివారించాలి. అయితే, అధిక మోతాదులో తీసుకుంటే కొన్ని దుష్ప్రభావాలు కూడా కలుగుతాయి. జీర్ణ సమస్యలు, పొట్ట నొప్పి, విరేచనాలు వచ్చే అవకాశం ఉంటుంది. కొంతమందిలో అలర్జీ ప్రతిచర్యలు కూడా కనిపిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. అందువల్ల మధుమేహ రోగులు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా గింజలను తినడం హానికరం అవుతుంది. ఇక పండులోని గుజ్జును మాత్రమే తీసుకోవడం మంచిది. రోజ్ ఆపిల్ పండు వేసవిలో శరీరానికి తేమను అందించే సహజ ఆహారం. అయితే దీనిని పరిమిత మోతాదులో, జాగ్రత్తలతో తీసుకుంటేనే పూర్తి ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

# గ్యాస్, అజీర్తి, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను తగ్గించే మిశ్రమం ఇది..



ఉదయం నిద్ర లేవగానే పొట్ట ఉబ్బరం, గ్యాస్, భారంగా అనిపించడం వంటి జీర్ణ సమస్యలు చాలా మందిని వేధిస్తుంటాయి. చాలా మంది ఈ సమస్యలకు మందులు వాడుతూ ఉంటారు. అయితే రోజంతా ఉత్సాహాన్ని తగ్గించే ఈ సమస్యలకు క్లిష్టమైన డైట్‌లు లేదా సప్లిమెంట్స్ అవసరం ఇకపై అవసరం పడకపోవచ్చు. సాధారణంగా ఇంట్లో లభించే కొన్ని పదార్థాలతోనే ఈ సమస్యలను తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అరటి పండు, నిమ్మరసం, రాక్ సాల్ట్ (సేంద్రీయ ఉప్పు) ను ఉపయోగించి ఈ సమస్యల నుండి చాలా సులభంగా బయటపడవచ్చు. ఈ మిశ్రమాన్ని ఉదయం ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల జీర్ణక్రియ సహజంగా ప్రారంభమవుతుంది. ఇది పొట్టపై ఒత్తిడి లేకుండా, నెమ్మదిగా జీర్ణవ్యవస్థను చురుకుగా చేస్తుంది.

**తయారు చేయడం ఇలా..**

అంతేకాకుండా ఈ మిశ్రమాన్ని తయారు చేయడం కూడా చాలా సులభం. కొంచెం గట్టిగా ఉన్న అరటి పండును తీసుకుని, దానిపై తాజా నిమ్మరసం పిండాలి. తర్వాత కొద్దిగా రాక్ సాల్ట్ చల్లి కలిపి తీసుకోవాలి. ఈ మూడు పదార్థాలు కలిపి ఒక ప్రభావవంతమైన జీర్ణవ్యవస్థ-ఫ్రెండ్లీ ఆహారంగా పనిచేస్తాయి. వీటిని కలిపి తీసుకోవడం వల్ల రాత్రి సమయంలో ఏర్పడే ఉబ్బరం తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే గ్యాస్ సమస్యలు తగ్గి, మలబద్ధకం నుంచి బయట పడవచ్చు. జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియా సమతుల్యం కాపాడటానికి కూడా ఇది సహాయపడుతుంది. అరటి పండులో ఉండే ప్రీబయోటిక్ ఫైబర్ గట్ (జీర్ణ వ్యవస్థ)లో ఉండే మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. ఇది మలవిసర్జనను సులభతరం చేస్తుంది. నిమ్మరసం జీర్ణరసాల ఉత్పత్తిని పెంచి ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. రాక్ సాల్ట్ పొట్టలో ఆమ్ల ఉత్పత్తిని సపోర్ట్ చేసి గ్యాస్, ఉబ్బరం తగ్గించడంలో సహాయపడుతుంది.

**ఏ సమయంలో..**

ఈ మిశ్రమాన్ని ఉదయం ఖాళీ కడుపుతో తీసుకోవడం ఉత్తమం. ఇలా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ రోజును సహజంగా ప్రారంభిస్తుంది. అవసరమైతే కొన్ని నానబెట్టిన బాదం పప్పులతో కలిపి తీసుకోవచ్చు, ఇది శక్తి స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. అయితే, అరటి పండు చాలా ముదురు కాకుండా కొద్దిగా గట్టిగా ఉన్నదాన్ని ఎంపిక చేయడం మంచిది. అలాగే ఏదైనా జీర్ణ సమస్యలు ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించడం అవసరం. చిన్న చిన్న ఆహారపు అలవాట్లు కూడా రోజువారీ జీర్ణక్రియపై పెద్ద ప్రభావం చూపిస్తాయి. ఈ సులభమైన మిశ్రమాన్ని అలవాటు చేసుకుంటే పొట్ట తేలికగా ఉండటమే కాకుండా, రోజంతా సౌకర్యంగా అనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

# వేసవి తాపానికి లేజీ డ్రింక్



మండే ఎండల్లో కేవలం నీళ్లు మాత్రమే తాగితే చాలదు. శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ కూడా అందాలి. అందుకే.. ఇప్పుడు చాలామంది 'లేజీ డ్రింక్' వెంట పడుతున్నారు. సాధారణ నీటి కంటే 10 రెట్లు ఎక్కువ హైడ్రేషన్ అందించే ఈ డ్రింక్‌ను చాలా సులభంగా తయారు చేసుకోవచ్చు.

**కావలసిన పదార్థాలు**

నీటిలో నానబెట్టిన సబ్జా గింజలు: ఒక టేబుల్ స్పూన్ నీళ్లు/ కొబ్బరి నీళ్లు: ఒక గ్లాసు. నిమ్మరసం: ఒక టీస్పూన్ చక్కెర/ తేనె/ తాటి బెల్లం : రుచికి సరిపడా పుదీనా ఆకులు: నాలుగైదు

**తయారీ విధానం**

నానబెట్టిన సబ్జా గింజలను గ్లాసు నీటిలో వేయాలి. అందులో నిమ్మరసం, తేనె వేసి బాగా కలపాలి. చలవ కోసం పైన పుదీనా ఆకులు వేసి చల్ల చల్లగా తాగేయడమే!

**ఎన్నో ప్రయోజనాలు**

వేసవి తాపానికి 'సబ్జా గింజలు' సమర్థంగా చెక్ పెడతాయి. వాటి బరువు కంటే 10-12 రెట్లు ఎక్కువ నీటిని పీల్చుకుంటాయి. అందుకే.. సబ్జా గింజలతో చేసే డ్రింక్ శరీరానికి గంటల తరబడి హైడ్రేషన్ అందిస్తుంది. ఇక శరీరంలోని అంతర్గత వేడిని తగ్గించడంలోనూ ఇవి ముందుంటాయి. నిమ్మరసం, కొబ్బరి నీళ్లు కలపడం వల్ల సోడియం, పొటాషియం లాంటి ఎలక్ట్రోలైట్స్ కూడా శరీరానికి అందుతాయి. ఎండ వల్ల వచ్చే అలసటను తగ్గిస్తాయి. అంతేకాదు, రెగ్యులర్‌గా వాడుకునే వాటర్ బాటిల్‌లో కొన్ని సబ్జా గింజలను వేసుకుంటే చాలు. ఆ రోజంతా ఎక్కడికి వెళ్లినా ఆ నీటిని తాగుతూ హైడ్రేటెడ్‌గా ఉండవచ్చు. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు, వర్కవుట్స్ చేసిన తర్వాత ఈ నీటిని తాగితే తక్షణ శక్తి లభిస్తుంది.

# పెదవులు తరచూ పొడిబారుతున్నాయా.. అయితే ఈ చిట్కాలను పాటించండి



ముఖం అందంగా కనిపించడంలో పెదవులు కూడా ముఖ్య పాత్ర పోషిస్తాయి. పెదవుల అందాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా చాలా ముఖ్యం. అయితే కొన్నిసార్లు పెదవులకు సంబంధించిన సమస్యలు కూడా తలెత్తూ ఉంటాయి. వాటిలో పెదవులు పొడిబారడం కూడా ఒకటి. ఈ సమస్యను చాలా మంది ఎదుర్కొనే ఉంటారు. పెదవులు పొడిబారడం (ఐఠీఎ ాఅజూం) చాలా మందిని వేధించే సాధారణ సమస్య. చల్లని వాతావరణం, ఎండ తీవ్రత, నీటి లోపం, తరచూ పెదవులను నాలుకతో తడి చేయడం, కొన్ని కాస్మెటిక్ ఉత్పత్తులలో ఉండే రసాయనాలు ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా ఉంటాయి. ముఖ్యంగా దాల్చిన చెక్క, సిట్రస్, మింట్, మెంతోల్, కర్పూరం వంటి పదార్థాలు కలిగిన ఉత్పత్తులు పెదవుల పొడిబార్పును మరింత పెంచుతాయి. అయితే డెర్మటాలజిస్ట్ లు సూచించినట్లుగా పెదవులు పొడిబారడాన్ని తగ్గించడానికి కొన్ని సులభమైన చిట్కాలు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. పెదవుల పొడాబారడాన్ని తగ్గించే సులభమైన చిట్కాల గురించి వారు వివరిస్తున్నారు. లిప్ బామ్‌ను నేరుగా అప్లై చేయకుండా ముందు స్వల్పంగా మాయిశ్చరైజర్‌ను రాయడం మంచిది. ఇది పెదవుల తేమను రక్షించడంలో సహాయపడుతుంది. అలాగే పెదవులను తరచూగా నాలుకతో తడి చేయడం ఒక చెడు అలవాటు. తాత్కాలికంగా తేమ ఇచ్చినట్టు అనిపించినా, ఇది సహజమైన ఆయిల్స్‌ను తొలగించి మరింత పొడిబార్పుకు దారి తీస్తుంది. దీంతో ఒక చక్రంలా సమస్య పెరుగుతుంది. మ్యాట్ లిప్‌స్టిక్‌లను, ముఖ్యంగా ఎక్కువసేపు ఉండే డార్క్ షేడ్స్‌ను నివారించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇవి ఎక్కువగా వాక్స్, పౌడర్ కలిగి ఉండటంతో పెదవులను మరింత పొడిగా మార్చే అవకాశం ఉంటుంది. బదులుగా గ్లోసీ లేదా ఇతర షేడ్స్‌ను ఉపయోగించడం మంచిది. అలాగే మొటిమల చికిత్స కోసం వాడే జెల్స్ (ఎవఅఓశీఎ్రీ జూవతీశీఞఅఎవ, ఖ్రీఅఎ్రీఅష ఖఎఅఎ వంటి పదార్థాలు కలిగినవి) పెదవుల దగ్గర ఉపయోగించకూడదు. ఇవి చర్మంలోని ఆయిల్‌ను తగ్గించడానికి రూపొందించబడినవి కాబట్టి పెదవులకు చాలా కఠినంగా ఉంటాయి. రాత్రిపూట పెదవుల సంరక్షణ చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. నిద్రకు ముందు మాయిశ్చరైజర్‌ను రాసి, దాని పై పలుచని పెట్రోలియం జెల్లీ పొర వేస్తే ఉదయానికి పెదవులు తేమగా, మృదువుగా మారుతాయి. ఇటువంటి సులభమైన చిట్కాలను పాటించడం ద్వారా పెదవుల పొడిబార్పును తగ్గించుకోవచ్చు. సరైన సంరక్షణతో పెదవులు ఆరోగ్యంగా, చక్కగా కనిపిస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

## దృశ్యం 3 తెలుగు వెర్షన్‌పై డైరెక్టర్ జీతూజోసెఫ్ గుడ్‌న్యూస్..!





మాలీవుడ్ నుంచి రిలీజై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచిన ఫ్రాంచైజీల్లో టాప్‌లో ఉంటుంది దృశ్యం జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ ఫ్రాంచైజీ క్రైం థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కగా.. సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో ప్రేక్షకులను సీట్లకు కట్టిపడేస్తుంది. ఇప్పుడు ఈ ఫ్రాంచైజీలోమరోసారి దృశ్యం 3 కూడా వస్తుందని తెలిసిందే. దృశ్యం ఫస్ట్ పార్ట్ థియేటర్‌లో విడుదలవగా.. రెండో పార్టు ఓటీటీలో విడుదలైంది. రెండు పార్టులను తెరకెక్కించిన ఆశీర్వాద్ సినిమాస్ దృశ్యం 3ని కూడా తెరకెక్కిస్తోంది. మలయాళంలో మోహన్ లాల్ , మీనా కాంబోలో వస్తోన్న దృశ్యం 3 మే 21న గ్రాండ్‌గా విడుదల కానుంది. తెలుగులో వెంకటేశ్, మీనా కాంబోలో రావాల్సిన దృశ్యం 3 సినిమా వెంకీ బిజీ షెడ్యూల్స్ వల్ల తెరకెక్కించడం లేదని ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే వెంకీ దృశ్యం 3 కోసం ఎదురుచూస్తున్న మూవీ లవర్స్‌కు నిరాశ మిగిలింది. వారి కోసం డైరెక్టర్ జీతూ జోసెఫ్ గుడ్‌న్యూస్ అందించాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో చిట్‌చాట్ సెషన్‌లో దృశ్యం 3 మలయాళ వెర్షన్‌తోపాటు మే 21నే తెలుగు, తమిళం, కన్నడ డబ్బింగ్ వెర్షన్లు కూడా విడుదలవుతాయని చెప్పాడు. మొత్తానికి తెలుగు రీమేక్ లేకున్నా డబ్‌డ్ వెర్షన్ వస్తుండటంతో కొంత రిలీఫ్ అవుతున్నారు మూవీ లవర్స్. కాగా హిందీలో అజయ్ దేవ్‌గన్, శ్రియా కాంబోలో దృశ్యం 3 కూడా తెరకెక్కుతుండగా.. ఈ మూవీని 2026 అక్టోబర్ 2న రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. అంటే ఒరిజినల్ (మలయాళం) వెర్షన్ రిలీజైన 6 నెలల తర్వాత హిందీలో రాబోతుందన్నమాట.

## ప్రముఖ నటి కూతురు.. ఫస్ట్ సినిమా పోస్టర్ విడుల

ప్రముఖ నటి వనితా విజయ్‌కుమార్ కూతురు జోవిక టాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తుంది. తాను నటిస్తున్న కొత్త సినిమా అగధ నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా విడుదల చేశారు. స్టార్ కిడ్‌గా గుర్తింపు ఉన్న జోవిక తమిళ్ బిగ్ బాస్ సీజన్- 7లో కనిపించిన విషయం తెలిసిందే.. తమిళ్‌లో గతేడాది మిసెస్ �c మిస్టర్ మూవీతో అలరించిన జోవిక ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. ప్రముఖ నిర్మాత--దర్శకుడు ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో రానున్న చిత్రం అగధ.. మిస్టికల్ డివైన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ మూవీలో హరిణి పాత్రలో జోవిక కనిపించనుంది. ఈ చిత్రంలో హీరోయిన్ కామాక్షీ భాస్కర్ల ప్రధాన పాత్ర పోషించారు. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మించిన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో త్వరలో విడుదల కానుంది. ఈ మూవీలో మహాదేవి పాత్రలో నటించిన కామాక్షీ భాస్కర్ల లుక్‌ని కొద్దిరోజుల క్రితమే రివీల్ చేశారు. “డర్టీ హరి’ చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న శ్రవణ్ రెడ్డికి ఎం.ఎస్. రాజు. మరోసారి ‘అగధ’లో సింహ పాత్ర చేసే అవకాశం ఇచ్చారు. కథలోని దైవిక, ఆధ్యాత్మిక అంశాల చుట్టూ ఉన్న రహస్యాన్ని ఛేదించే పాత్రను సింహ పోషించారు. 85 రోజుల షూటింగ్... విస్తృతమైన సెట్ వర్క్... దాదాపు 45 నిమిషాల వీఎఫ్ఎక్స్‌తో ‘అగధ’ ప్రేక్షకులకు ప్రత్యేకమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుంది” అని చిత్రయూనిట్ పేర్కొంది.





## ఓటీటీలోకి శర్వానంద్ ‘బైకర్’.. స్ట్రీమింగ్ ఎప్పటి నుంచంటే?

టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ నటించిన లేటెస్ట్ స్పోర్ట్స్ డ్రామా ‘బైకర్’ ఓటీటీలోకి రాబోతుంది. భారతదేశంలోనే మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రం, థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోనే డిజిటల్ ప్రేక్షకులను పలకరించబోతోంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు దక్కించుకుంది. దీంతో ఈ చిత్రం మే 1 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది. ఇక హిందీలో ఈ సినిమాను ‘శర్వా’ అనే టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ కథానాయికగా నటించగా, సీనియర్ నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. ఒక ప్రొఫెషనల్ బైక్ రేసర్ తన కెరీర్‌లో ఎదుర్కొనే సవాళ్లు, తండ్రి ఆశయాల కోసం అతను చేసే పోరాటాన్ని ఈ సినిమాలో అద్భుతంగా చూపించారు. థియేటర్లలో మిశ్రమ స్పందన లభించినప్పటికీ, రేసింగ్ సీక్వెన్స్ మరియు టెక్నికల్ వాల్యూస్ పరంగా సినిమాకు మంచి ప్రశంసలు దక్కాయి.




## రితేష్ రాణా మార్క్ కామెడీ థ్రిల్లర్.. సత్య ‘జెట్లీ’ నుంచి కొత్త ట్రైలర్

మత్తు వదలరా పార్ట్ 1,2 చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కమెడియన్ సత్య హీరోగా, విలక్షణ దర్శకుడు రితేష్ రాణా తెరకెక్కించిన తాజా చిత్రం ‘జెట్లీ’. ఈ చిత్రం మే 01న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా కొత్త ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. అ ట్రైలర్ చూస్తుంటే కథను మొత్తం ట్రైలర్‌లోనే రివీల్ చేసినట్లు తెలుస్తుంది. సత్య తనదైన టైమింగ్ మరియు మేనరిజమ్స్‌తో పూర్తిస్థాయి హీరోగా మెప్పించబోతున్నాడు. మిస్ యూనివర్స్ ఇండియా 2024 రియా సింఘా ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అవుతుండగా, వెన్నెల కిషోర్, వైవా హర్ష మరియు అజయ్ వంటి హేమాహేమీలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై చెర్రీ నిర్మించిన ఈ చిత్రానికి కాలా భైరవ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. సెన్సార్ నుంచి ఇప్పటికే ఖ/ూ సర్టిఫికెట్ అందుకున్న ఈ చిత్రం, సమ్మర్ కానుకగా మే 1, 2026న థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించడానికి సిద్ధమైంది. సత్య మార్క్ కామెడీ మరియు రితేష్ రాణా స్టైలిష్ టేకింగ్ కలగలిసిన ఈ సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## కందుల సులోచనగా అనుపమ.. కొత్త మూవీ పోస్టర్ విడుదల

శర్వానంద్ భోగి సినిమా నుంచి అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ తాజాగా విడుదల చేశారు. 1960 నేపథ్యంలో సాగే ఈ కథకు అనుగుణంగా ఆమె లుక్ ఉంది. ఇప్పటికే శర్వానంద్ లుక్‌ను కూడా మేకర్స్ షేర్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ‘నారీ నారీ నడుమ మురారి’, బైకర్ చిత్రాలతో జోరు మీదు ఉన్న శర్వా.. హ్యాట్రిక్‌పై కన్నేశాడు. భోగి సినిమాతో తప్పకుండా హిట్ కొట్టాలని ఆయన ఉన్నారు. ఈ మూవీని దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్నారు. భోగి మూవీలో కందుల సులోచన రాణి పాత్రలో అనుపమ కనిపించనుందని తాజాగా మేకర్స్ ప్రకటించారు. తాజాగా విడుదలైన పోస్టర్ అనుపమ తన సాధారణ ఇమేజ్‌కు భిన్నంగా ఉంది. బోల్డ్, డీగ్లామరైజ్డ్ పాత్రలో కనిపించడంతో ఈ లుక్ అందరి దృష్టిని ఆకర్షించింది. పోస్టర్‌తో పాటు చిత్ర యూనిట్ ఇలా ఒక క్యాప్షన్ కూడా చేర్చింది. “ప్రకృతి బిడ్డ... గంగా నిలయం... కందుల గర్వం... భోగికి ప్రాణం” అని అనుపమ గురించి వర్ణించారు. ఉత్తర తెలంగాణ - మహారాష్ట్ర ప్రాంతాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ స్టోరీని పాన్ ఇండియా రేంజ్‌లో నిర్మిస్తున్నారు. ఇందులో డింపుల్ హయాతి, రోహిత్ పాఠక్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ‘భోగి’ చిత్రం ఆగష్టు 28, 2026న థియేటర్లలో విడుదల కానుంది.



# బిజినెస్

## రిలయన్స్ రిటైల్ చేతికి ప్రియాంక చోప్రా అనోమలి



రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ సంస్థ.. ప్రియాంక చోప్రాకు చెందిన గ్లోబల్ హెయిర్‌కేర్ బ్రాండ్ 'అనోమలి'ని, దాని ట్రేడ్‌మార్క్‌లు, బ్రాండ్ ఆస్తులు, డిజిటల్ ప్రాపర్టీలతో సహా కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. దీనికి సంబంధించిన ట్వీట్ కూడా కంపెనీ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. అనోమలి కొనుగోలు.. రిలయన్స్ రిటైల్ బ్యూటీ పోర్ట్‌ఫోలియోను గణనీయంగా విస్తరించనుంది. అంతేకాకుండా, భారతదేశంలో మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా సంస్థ తన వృద్ధిని సాధించే బ్రాండ్‌లను నిర్మించి, విస్తరించాలనే దాని నిబద్ధతను కూడా ఇది బలపరుస్తుంది. అనోమలి బ్రాండ్‌ను 2021లో ప్రముఖ నటి, వ్యాపారవేత్త ప్రియాంక చోప్రా ప్రారంభించారు. ఇది అందుబాటు ధరలో లభించే ఒక పాపులర్ హెయిర్‌కేర్ బ్రాండ్. ప్రారంభం నుంచే అత్యధిక ప్రజాదరణ పొందిన ఈ బ్రాండ్.. కొద్ది కాలంలోనే బలమైన అంతర్జాతీయ ఉనికిని ఏర్పరచుకుంది. ఈ కొనుగోలుతో రిలయన్స్ రిటైల్ తమ బ్యూటీ అండ్ పర్సనల్ కేర్ రంగంలో ఉన్న పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. ఈ సంస్థ ఇప్పటికే భారతదేశంలో పెద్ద రిటైల్ నెట్‌వర్క్, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను కలిగి ఉంది. ముఖ్యంగా టీరా వంటి ఓమ్నిచానల్ బ్యూటీ ప్లాట్‌ఫారమ్ ద్వారా వినియోగదారులకు విభిన్న బ్రాండ్లను అందిస్తోంది. ఇప్పుడు అనామలీ కూడా ఈ వ్యవస్థలో చేరడంతో, బ్రాండ్ మరింత వేగంగా విస్తరించే అవకాశం ఉంది. రిలయన్స్ రిటైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ ఈ కొనుగోలు గురించి మాట్లాడుతూ.. అనోమలి తమ బ్యూటీ పోర్ట్‌ఫోలియోలో ఒక ముఖ్యమైన భాగమవుతుందని చెప్పారు. ప్రత్యేకంగా భారత మార్కెట్‌పై దృష్టి పెట్టి.. జుట్టు, చర్మ అవసరాలకు అనుగుణంగా కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కాగా ప్రియాంక చోప్రా బ్రాండ్ క్రియేటివ్ డైరెక్టర్‌గా కొనసాగుతారని వెల్లడించారు.

## చారిత్రక కనిష్ఠస్థాయికి పడిపోయిన విలువ

**ముంబై :** దేశీయ కరెన్సీ విలువ మరింత కరిగిపోయింది. డాలర్‌తో పోలిస్తే మారకం విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్‌తో పోలిస్తే కరెన్సీ విలువ 20 పైసలు కోల్పోయి ఆల్‌టైంకు కనిష్ఠ స్థాయి 94.88కి పడిపోయింది. ఇంధన ధరలు భగ్గుమనడంతో రూపాయితోపాటు ఇతర కరెన్సీలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనయ్యాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. దీనికి తోడు దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడం కూడా రూపాయి పతనానికి ఆజ్యంపోశాయి. బ్యారెల్ క్రూడాయిల్ ధర 115 డాలర్ల పైకి చేరుకోవడంతో దేశీయ దిగుమతుల భారం మరింత పెరగనున్నదని, అలాగే పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కూడా ఆందోళనను మరింత పెంచిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు అంతా ఆశాజనకంగా లేకపోవడంతో అమెరికా ఫెడరల్ రిజర్వు ఈసారి ద్రవ్యపరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలుండటం కూడా పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్‌ను నీరుగార్చిందని పేర్కొన్నారు. 94.79 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్చేంజ్ రేటు చివరకు 20 పైసల నష్టంతో 94.88 వద్దకు పడిపోయింది.

# అదానీ పవర్ మెరుపులు.. మెరిపించిన ప్రాఫిట్

**న్యూఢిల్లీ:** ప్రయివేట్ రంగ విద్యుత్ దిగ్గజం అదానీ పవర్ గత ఆర్థిక సంవత్సరం(2025--26) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి--మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 64 శాతం జంప్‌చేసి రూ. 4,271 కోట్లను అధిగమించింది. ఆదాయంలో వృద్ధి, తగ్గిన పన్ను వ్యయాలు ఇందుకు దోహదపడ్డాయి. అంతక్రితం ఏడాది(2024--25) ఇదే కాలంలో కేవలం రూ. 2,599 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 14,535 కోట్ల నుంచి రూ. 15,989 కోట్లకు ఎగసింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 12,971 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2024--25లో రూ. 12,750 కోట్ల లాభం అందుకుంది. 2026 మార్చి31కల్లా మహన్(1,600 మెగావాట్లు), రాయ్‌పూర్(1,600 మెగావాట్లు), రాయ్‌గఢ్(1,600 మెగావాట్లు) రెండో దశల పనులు 86--47 శాతం మధ్య పూర్తయినట్లు కంపెనీ వెల్లడించింది. సొంత అనుబంధ కంపెనీ కోబ్రా పవర్ 1320 మెగావాట్ల రెండో దశ ఈ ఆర్థిక సంవత్సరం(2026--27)లో పూర్తికాగలదని పేర్కొంది. 2031--32కల్లా 23.7 గిగావాట్ల థర్మల్ విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది క్యూ4లో మహారాష్ట్ర విద్యుత్ బోర్డు



నుంచి 25ఏళ్లపాటు 1,600 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు ఎల్‌వోఏను అందుకుంది.

# ఐటీ రంగాన్ని మార్చనున్న ఏఐ: ఇన్ఫోసిస్ సీఈఓ

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పలువురు ప్రముఖులు స్పందిస్తూనే ఉన్నారు. తాజాగా ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ తన అభిప్రాయం వెల్లడించారు. కృత్రిమ మేధస్సు.. భారతదేశ ఐటీ రంగంలో చాలా పెద్ద మార్పులను తీసుకురానుంది. అయితే, ఈ మార్పులు ఉద్యోగాలను తగ్గించవని, ప్రతిగా మరిన్ని అవకాశాలను సృష్టిస్తాయని ఆయన స్పష్టం చేశారు. భారతీయ ఐటీ కంపెనీలు ఇప్పటివరకు.. ఎక్కువగా కొత్తగా కాలేజీ నుంచి వచ్చిన యువతను పెద్ద సంఖ్యలో నియమించుకొని, అనుభవజ్ఞులను తక్కువగా ఉంచే పిరమిడ్ నిర్మాణాన్ని అనుసరించాయి. కానీ ూ×  ప్రభావంతో ఈ నిర్మాణం "డైమండ్" ఆకారంగా మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అంటే.. మధ్యస్థ, ఉన్నత నైపుణ్యాలు కలిగిన నిపుణుల అవసరం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ పరిణామం ఒక్కసారిగా జరిగేది కాదు. ఉదాహరణకు.. గత ఆర్థిక సంవత్సరంలో ఇన్ఫోసిస్ 20,000 మంది కొత్త గ్రాడ్యుయేట్లను నియమించగా, ఈ సంవత్సరం కూడా దాదాపు అదే స్థాయిలో నియామకాలు కొనసాగనున్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఇన్ఫోసిస్ కంపెనీ ఇప్పటికే ూ× ఆధారిత భవిష్యత్తుకు తగిన విధంగా తన వ్యూహాలను మార్చుకుంటోందని తెలుస్తోంది. కొత్తగా చేరే ఉద్యోగులకు కంపెనీ సాధారణ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌తో పాటు,




ఫౌండేషన్ మోడల్ టూల్స్‌పై కూడా శిక్షణ ఇస్తోంది. సీఈఓ సలీల్ పరేఖ్ ప్రకారం.. ఏఐ సేవలలో సుమారు 300 బిలియన్ డాలర్ల మార్కెట్ అవకాశం ఉంది. ఇన్ఫోసిస్ తన సేవలను విస్తరించడమే కాకుండా, ఇప్పటికే ఉన్న సేవల్లో ూ×ని సమీకరిస్తోంది. దీనివల్ల కస్టమర్లు తమ వ్యాపారాన్ని మరింత విస్తరించుకునే అవకాశాలు పొందుతున్నారు.

# భారత టెన్నిస్‌లో జెన్నీ సంచలనం.. సానియా మిర్జా 'ఆల్‌టైమ్ రికార్డు' బ్రేక్..!

భారత టెన్నిస్‌లో కొత్త తార దూసుకొచ్చింది. మహిళల సింగిల్స్‌లో టెన్నిస్‌లో జెన్నీ కనబర్ చరిత్రాత్మక విజయం సాధించింది. ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ మహిళల టెన్నిస్‌లో దుమ్మురేపిన జెన్నీ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. తద్వారా ప్రొఫెషన్ టెన్నిస్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన అతి చిన్న వయస్కురాలిలైన భారతీయురాలిగా రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించింది. 14 ఏళ్ల 5 నెలల వయసులోనే ఈ ఘనత సొంతం చేసుకున్న జెన్నీ లెజెండ్ సానియా మిర్జా రికార్డును అధిగమించింది. సరిగ్గా 25 ఏళ్ల క్రితం సానియా మిర్జా ఐటీఎఫ్‌డబ్ల్యూలో క్వార్టర్ ఫైనల్ చేరి రికార్డు నెలకొల్పింది. అప్పటి నుంచి ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలిగా రికార్డు అమె పేరిటే ఉంది. ఇన్నేళ్లుగా చెక్కుచెదరని సానియా రికార్డును జెన్నీ బద్ధలు కొట్టింది. రెండో అంతర్జాతీయ టోర్నమెంట్‌లోనే సత్తా చాటిన తను... 16వ రౌండ్‌లో సందీప్తి సింగ్ రావును 6-3, 7-5తో ఓడించి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. ఈ ఏడాది ఆరంభంలోనే ఆస్ట్రేలియన్ ఓపెన్ అండర్ -14 టైటిల్ గెలుపొందిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించిన జెన్నీ ఇప్పుడు సానియాను అధిగమించడం విశేషం. టీనేజ్‌లోనే సంచనల విజయాలతో అబ్బురపరుస్తున్న ఈ అమ్మాయి టెన్నిస్‌లో భారత మరో ఆశాకిరణంగా ఎదుగుతోంది.




### చిన్న వయస్కురాళ్లు వీళ్లే..

జెన్నీ కనబర్ -- 14 ఏళ్ల 5 నెలలు.
సానియా మిర్జా -- 14 ఏళ్ల 5నెలల 11 రోజులు.
అంకిత బాంబ్రీ -- 14 ఏళ్ల 8 నెలలు.
తారా అయ్యర్ -- 5 ఏళ్ల 10 నెలలు.
ఇషా లఖానీ -- 15 ఏళ్ల.
రుతుజా భోసాలే -- 15 ఏళ్ల 2 నెలలు.
సనా బాంబ్రీ -- 15 ఏళ్ల 2 నెలలు.
మాయా రాజేశ్వరన్ రేవతి -- 15 ఏళ్ల 6 నెలలు.
శ్రుతి అహ్లావత్ -- 15 ఏళ్ల 7 నెలలు.
పార్థసారథి అరుణ్ ముండే -- 15 ఏళ్ల 7 నెలలు.
మహక్ జైన్ -- 15 ఏళ్ల 18 నెలలు.

## ఎంగిడి వచ్చినా 'కీలక మ్యాచ్'కు దూరమే.. షాక్‌లో ఢిల్లీ క్యాపిటల్స్..!

పంతొమ్మిదో సీజన్‌లో అనూహ్యగా ఆస్పత్రి పాలైన లుంగి ఎంగిడి ఫిట్‌నెస్ సాధించాడు. ఫీల్డింగ్ చేస్తూ కిందపడి పల్టీ కొట్టిన ఎంగిడి తల గాయం నయమవ్వడంతో మళ్లీ ఆటకు సిద్ధమయ్యాడు. మ్యాచ్ కోసం ఈ సఫారీ పేసర్ ఢిల్లీ క్యాపిటల్స్ స్క్వాడ్‌లో చేరాడు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా ఫ్రాంచైజీ వెల్లడించింది. 'ఎంగిడి వచ్చేశాడు. స్క్వాడ్‌తో కలిశాడు' అని ఎక్స్‌లో వీడియో పోస్ట్ చేసింది ఢిల్లీ యాజమాన్యం. ఐపీఎల్-19లో కంకషన్‌కు గురైన ఎంగిడి పూర్తిగా కోలుకొని ఢిల్లీ క్యాపిటల్స్ స్క్వాడ్‌తో కలిశాడు. ఈ విషయాన్ని ఢిల్లీ పేసర్ కైలీ జేమీసన్ 'ఎంగిడి తిరిగొచ్చాడు. మళ్లీ అతడు ఆడేందుకు సిద్ధమవుతున్నాడు' అని చెబుతున్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది యాజమాన్యం. ఫ్రాంచైజీ పంచుకున్న ఆ వీడియోలో ఎంగిడి బౌలింగ్ సాధన



చేస్తున్నాడు. అయితే.. ఎంగిడి వచ్చినా ఫ్రాంచైజీ మాత్రం ఒకింత అసంతృప్తితో ఉంది. ఎందుకంటే.. మే 1వ తేదీన రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌కు ఈ స్పీడ్‌స్టర్ అందుబాటులో ఉండడు. ఎందుకంటే.. ఐసీసీ నియమావళి ప్రకారం కంకషన్‌కు గురైన ఆటగాడికి కనీసం ఏడు రోజులు విశ్రాంతినివ్వాలి. కానీ, ఎంగిడి కంకషన్‌తో మైదానం వీడి మే 1 నాటికి ఆరు రోజులు అవుతుంది. కాబట్టి. తదుపరి మ్యాచ్‌కు ఎంగిడి జట్టు సెలక్షన్‌కు అందుబాటులో ఉండనున్నాడు. ఢిల్లీ తరఫున ఈ సీజన్‌లో గొప్పగా రాణిస్తున్న ఎంగిడి 6 మ్యాచుల్లో 7 వికెట్లు పడగొట్టాడు. ఇప్పటివరకూ ఆడిన 8 మ్యాచుల్లో మూడే విజయాలతో ఏడో స్థానంలో కొనసాగుతున్న ఢిల్లీ.. మే 1 న రాజస్థాన్‌ను ఓడిస్తే ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంటాయి.

# స్పోర్ట్స్

## టీ20 సిరీస్ కూడా లంకదే..!



మూడు మ్యాచ్‌ల వన్డే, టీ20 సిరీస్‌ల కోసం బంగ్లాదేశ్‌లో పర్యటిస్తున్న శ్రీలంక మహిళల క్రికెట్ జట్టు, తొలుత వన్డే సిరీస్‌ను 2-1 తేడాతో.. తాజాగా టీ20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది. సిల్హెట్ వేదికగా ఇవాళ (ఏప్రిల్ 30) జరిగిన రెండో టీ20లో శ్రీలంక 21 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక.. హర్షిత సమరవిక్రమ (49), కెప్టెన్ చమారీ ఆటపట్టు (42) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. మిగతా బ్యాటర్లలో ఇమేషా దులాని 27, నిలాక్షి డిసిల్వ 22 (నాటౌట్), హాసిని పెరీరా 9 పరుగులు చేశారు. బంగ్లా బౌలర్లలో ఫరిహా త్రిస్న, సుల్తానా ఖాతూన్, నహిద అక్తెర్, రితూ మోనీ తలో వికెట్ తీశారు. అనంతరం లక్ష్య ఛేదనలో తడబడిన బంగ్లా బ్యాటర్లు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 133 పరుగులకే పరిమితమయ్యారు. షర్మిన్ అక్తెర్ (44 నాటౌట్) బంగ్లాను గెలిపించేందుకు విఫలయత్నం చేసింది. ఆమెకు మిగతా బ్యాటర్ల నుంచి సహకారం లభించలేదు. ఓపెనర్లు దిలారా అక్తెర్ 23, జుయారియా ఫిర్దోస్ 29 పరుగులు చేసినా, ఆతర్వాత వచ్చిన బ్యాటర్లు చేతులెత్తేశారు. కెప్టెన్ నిగార్ సల్తానా 7, షోర్నా అక్తెర్ 12, శోభన మోస్త్రి డకౌటయ్యారు. రితూ మోనీ 9 పరుగులతో అజేయంగా నిలిచింది. లంక బౌలర్లలో కవిష దిల్హారి 2 వికెట్లు తీయగా.. మిథాలీ అయోధ్య మినహా మిగతా బౌలర్లంతా వికెట్లు తీయలేకపోయినా పొదుపుగా బౌలింగ్ చేశారు.

AKSHARA SAAVAL PRINTED PUBLISHED EDITED AND OWNED BY BADAVATH BALAJI PRINTED AT H.NO.-1-9-1296/5/B/A/1, NEW SHAYAMPET, KAZIPET MANDAL, HANUMAKONDA, TELANGANA-506001,EDITOR B.BALAJI CELL:8096677136 H.NO.-45/12/151, INDIRA NAGAR, MANDAL GEESUGONDA, WARANGAL TELANGANA-506013_ **RNI** :TEL TEL / 2023/ 84132